RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 337 బుధవారం 31 డిసెంబర్ 2025 పేజీలు : 4 వెల : రూ. 2.00

## భారత్‌లో పెరుగుతున్న అంటువ్యాధులు

న్యూఢిల్లీ : భారత్‌లో అంటువ్యాధుల వ్యాప్తి క్రమంగా పెరుగుతోంది. ఐసీఎంఆర్ నివేదిక ప్రకారం ఈ ఏడాది తొలి త్రైమాసికంలో అంటువ్యాధుల వ్యాప్తి 10.7 శాతంగా నమోదవగా.. రెండో త్రైమాసికంలో ఇది 11.5 శాతానికి పెరిగింది. ఐసీఎంఆర్ అధ్యయనంలో భాగంగా దేశవ్యాప్తంగా పరీక్షించిన ప్రతి 9 మందిలో ఒకరిలో సంక్రమిత వ్యాధికారకాలు ఉన్నట్టు తేలింది. ఐసీఎంఆర్ నెట్‌వర్క్ కింద ఉన్న ల్యాబ్‌ల్లో 4.5 లక్షల మందిని పరీక్షించగా 11.1 శాతం మందిలో వ్యాధికారక సూక్ష్మజీవులు ఉన్నట్టు కనుగొన్నారు. అక్యూట్ రెస్పిరేటరీ ఇన్ఫెక్షన్ (ఏఆర్ఐ) కేసుల్లో ఇన్‌ఫ్లుయెంజా-ఏ, తీవ్రమైన జ్వరం, రక్తస్రావం కేసుల్లో డెంగీ వైరస్, కామెర్ల కేసుల్లో హెపటైటిస-ఏ, డయేరియా కేసుల్లో నోరోవైరస్, అక్యూట్ ఎన్సిఫాలిటిస్ సిండ్రోమ్ (ఏఈఎస్) కేసుల్లో హెర్పస్ సింప్లెక్స్ వైరస్ (హెచ్ఎసవీ)లను టాప్-5 వ్యాధికారకాలుగా గుర్తించారు.

# మరో ఎన్నికలకు ఈసీ రెడీ..




హైదరాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఇటీవల తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు హెూరాహెూరీగా జరిగాయి. దీంతో పల్లెల్లో ఎన్నికల సందడి కొనసాగింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు ఎక్కువమంది గెలివగా.. తర్వాతి స్థానంలో బీఆర్ఎస్ మద్దతుతో పోటీ చేసిన సర్పంచ్‌లు ఉన్నారు.

ఇక మూడో స్థానంలో బీజేపీ నిలిచింది. ఈ ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో.. తెలంగాణలో మరో స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి రంగం సిద్ధమైంది. రాష్ట్రంలో మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమవుతోంది.

**త్వరలో మరో ఎన్నికలు...** ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఓటర్ల సవరణ జాబితా సిద్ధం చేయాలని ఈసీ నిర్ణయించింది. మంగళవారం నుంచి ఓటర్ల లిస్ట్ సవరణ ప్రక్రియ ప్రారంభం కాగా.. వచ్చే ఏడాది జనవరి 10లోపు పూర్తి చేయనుంది. జనవరి 1న ఓటర్ల జాబితా ముసాయిదాను విడుదల చేయనున్నారు. ఈ లిస్ట్‌కు సంబంధించి ప్రజలు, రాజకీయ పార్టీల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన తర్వాత జనవరి 10న తుది జాబితా విడుదల చేస్తారు.

దీని ఆధారంగా ఎన్నికలను నిర్వహిస్తారు. రాష్ట్రంలోని 117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్లలో ఎన్నికలు జరగనున్నాయి. కరీంనగర్, మంచిర్యాల, నిజామబాబాద్, కొత్తగూడెం, మహబూబ్ నగర్, రామగుండం కార్పొరేషనన్లకు ఎన్నికలు జరగనున్నాయి.

**ఫిబ్రవరిలో ఎన్నికలు..?...** జనవరిలో ఓటర్ల జాబితా సిద్ధం కానుండగా.. ఫిబ్రవరిలో మున్సిపాలిటీ, కార్పొరేషన్ల ఎన్నికలు జరిగే

## ఫిబ్రవరిలో మోగనున్న నగారా..!

అవకాముందని తెలుస్తోంది. ఇక ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను కూడా అదే నెలలో జరిపే ఛాన్స్ ఉంది. దీంతో ఫిబ్రవరిలో తెలంగాణలో మరో స్థానిక సంస్థల ఎన్నికల కోలాహలం ప్రారంభం కానుంది. ఇటీవల సర్పంచ్ ఎన్నికలు ముగియగా.. కొత్త సర్పంచ్‌లు ప్రమాణస్వీకారం చేశారు.




తిరుమల: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమలను సందర్శించారు. ఇవాళ(మంగళవారం) ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీవారిని రేవంత్ రెడ్డి కుటుంబసమే తంగా దర్శించుకున్నారు. దేవాలయ అధికారులు రేవంత్ కుటుంబస భ్యులకు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకున్న రేవంత్ కుటుంబం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారికి పూజారులు శ్రీనివాసుడి తీర్థప్రసాదాలు అందజేశారు. మరోవైపు సాధారణ భక్తులు తిరుమలకు పోటెత్తారు. ఏకాదశి సందర్భంగా ద్వార దర్శనం కోసం భారీగా తిరుమలకు చేరుకున్నారు. తండోపతండాలుగా వస్తున్న భక్తులతో తిరుమల ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తుల తాకిడికి తగినట్లుగానే అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. భక్తులను ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సకల సౌకర్యాలూ కల్పించారు. పోలీసులు సైతం పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నారు. కాగా, ముక్కోటి ఏకాదశి సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆలయాలు కిక్కిరిపోతున్నాయి. తెల్లవారుజాము నుంచే దేవాలయాలకు భక్తులు చేరుకుంటున్నారు. తెలంగాణలో యాద్రాద్రి, భద్రాచలం, ధర్మపురి, చిలుకూరి బాలాజీ సహా పలు పుణ్యక్షేత్రాల వద్ద భక్తుల తాకిడి అధికంగా ఉంది. ఇక, ఏపీలోని తిరుమల, సింహాద్రి అప్పన్న ఆలయం, ద్వారకా చినతిరుమల సహా వివిధ ఆలయాలకు భక్తులు తండోపతండాలుగా తరలివెళ్తున్నారు.




## వైకుంఠ ఏకాదశి.. తెలుగు రాష్ట్రాల్లో ఆలయాల వద్ద భక్తుల రద్దీ

వైకుంఠ ఏకాదశి సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లోని ఆలయా ల్లో రద్దీ నెలకొంది. తెల్లవారుజాము నుంచే భక్తులు శ్రీమహా విష్ణువు దర్శనానికి తరలివస్తున్నారు. ఉత్తర ద్వార దర్శనాలు చేసుకుంటున్నారు. తిరుమల శ్రీవారి ఆలయంలో తెల్లవారుజామునే ఉత్తర ద్వారాన్ని తెరిచారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి శ్రీవారిని దర్శించుకుంటున్నారు. విజయవాడ కనకదుర్గ ఆలయం, యాదాద్రి లక్ష్మీనరసింహస్వా మి ఆలయానికి భక్తులు పోటెత్తారు. భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి ఆలయంలో ఘనంగా వైకుంఠ ద్వార దర్శనం వేడుక ప్రారంభమైంది. ఉత్తర ద్వార దర్శనానికి భారీగా భక్తులు తరలివచ్చారు. గరుడ వాహనంపై శ్రీరామచంద్రస్వామి వారు, గజ వాహనంపై సీతమ్మ, హనుమత్ వాహనంపై లక్ష్మణస్వామి దర్శనమిచ్చారు.

**భద్రాచలంలో..** విశాఖ జిల్లా సింహాచలం పుణ్యక్షేత్రంలో ఉత్తర ద్వార దర్శనం వైభవోపేతంగా ప్రారంభమైంది. సింహాద్రి నాథుడు వైకుంఠ నారాయణుడి అలంకరణలో భక్తులను అనుగ్రహిస్తున్నారు. ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు కుమార్తె అదితి గజపతిరాజు తొలి దర్శనం చేసుకున్నారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు.

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ప్రభుత్వ విప్ పి.గణబాబు స్వామి వారిని దర్శించుకున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల శ్రీవారిని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, సినీనటుడు చిరంజీవి, ఆయన కుటుంబ సభ్యులు, భారత్ బయోటెక్ ఎండీ కృష్ణ ఎల్లా, తితిదే బోర్డు సభ్యురాలు సుచిత్ర ఎల్లా, సినీనటుడు నారా రోహిత్ దంపతులు, క్రికెటర్ తిలక్ వర్మ, సినీ నిర్మాత డీవీవీ దానయ్య తదితరులు దర్శించుకున్నారు.

# తిరుమలలో తెలంగాణ భవన్




హైదరాబాద్ : దేవ దేవుడు కలియుగ వైకుంఠం అయిన తిరుమలలో వెలసిన వెంకటేశ్వర స్వామి వారు ప్రపంచానికే దేవుడుగా ఉన్నారు. ఆయన కోసం దేశ విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తూంటారు. స్వామి వారి దర్శన భాగ్యం కోసం ఎంతో మంది ఆరాటపడతారు.

వారిలో పెద్ద చిన్న అన్న తారతమ్యం అయితే లేదు. ఎంతటి పదవిలో ఉన్నా కూడా స్వామి దర్శనం కోసం రావాలని ఆయన కరుణా కటాక్ష వీక్షణాలను అందుకోవాలని చూస్తారు. ఉమ్మడి ఏపీలో ఉన్నపుడు మొత్తం తెలుగు వారు అంతా వెంకన్న స్వామి కి ఏ ఇబ్బంది లేకుండా దర్శించుకునేవారు. అయితే విభజన ఏపీలో మాత్రం తెలంగాణా వారికి కొత్త సమస్యలు వస్తున్నాయని వాపోతున్నారు.

**ప్రాధాన్యత ఏదీ :** రాష్ట్రం విడిపోయినా అంతా ఒక్కటి అని అంటున్నా తమకు తిరుమలలో సరైన ప్రాధాన్యత అయితే దక్కడం లేదని తెలంగాణాకు చెందిన కొంతమంది ప్రజా ప్రతినిధులే ఆవేదన వ్యక్తం చేయడం విశేషం. తెలంగాణాకు చెందిన ఎమ్మెల్యేలు మంత్రులకు సైతం తగిన ప్రాముఖ్యత అయితే లేకుండా పోతోందని మాజీ మంత్రి బీఆర్ఎస్ కీలక నాయకుడు గతంలోనే ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు చాలా మంది అయితే ఇదే మాటగా ఉంది. వారు మనసులో ఏదీ దాచుకోకుండా పూర్తిగా తన అసంతృప్తిని వెళ్ళగక్కారు.

**ఆ పనిచేస్తే బాగు :** ఇక తాజాగా సోమవారం నుంచి ప్రారంభం అయిన తెలంగాణా శాసనసభ సమావేశాలలో బీఆర్ఎస్ కి చెందిన ఎమ్మెల్యే మాజీ మంత్రి గంగుల కమలాకర్ అయితే ఇదే విషయాన్ని సభలో ప్రస్తావించడం విశేషం. ఆయన తెలంగాణా నుంచి తిరుమలకు వెళ్ళిన ప్రజా ప్రతినిధులకు అయితే ఇబ్బందులే ఎదురవుతున్నాయని బాధను వ్యక్తం చేశారు. ఈ విషయంలో పరిష్కారాలు చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. వీలు అయితే తిరుపతిలో తెలంగాణా భవన్ ని నిర్మించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తే బాగుంటుంది అని సూచనలు కూడా ఇచ్చారు.

**బసతో పాటు అన్నీ :** తిరుమలకు మంత్రులు వెళ్తే ఒకలా ఉంటోందని ఇతర ప్రజా ప్రతినిధులు వెళ్తే మరోలా ఉంటోందని కూడా ఆయన చెప్పారు. దర్శనమే కాదు బసకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. అందువల్ల తిరుమలలో తెలంగాణా భవన్ ని ఏర్పాటు చేయడం ఉత్తమనని సూచించారు. ఇప్పటికే తిరుపతిలో కర్ణాటక భవన్, తమిళనాడు భవన్ ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. ఇపుడు తెలంగాణా భవన్ ని కూడా నిర్మిస్తే బాగుంటుందని సలహా ఇచ్చారు. అయితే ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏమి ఆలోచిస్తుందో చూడాల్సి ఉంది. ఎందుకంటే ఏపీ ప్రభుత్వంతో సంప్రదించి నిర్ణయం తీసుకోవాలి. అయితే సీఎం రేవంత్ రెడ్డికి ఏపీ సీఎం చంద్రబాబుకు మధ్య మంచి రిలేషన్స్ ఉన్నాయని అంటారు కాబట్టి కాంగ్రెస్ ప్రభుత్వంలో అయితే కచ్చితంగా తిరుపతిలో తెలంగాణా భవన్ నిర్మాణం జరిగి తీరవచ్చు అన్న ఆశలు కూడా అందరిలో ఉన్నాయట.

# జనవరి 1, 2026...

# భారత్ కీలక అడుగు!

## గోల్డ్ మార్కెట్‌లో ప్రకంపనలు, షాక్‌లో డొనాల్డ్ ట్రంప్!




న్యూయార్క్: 2026 జనవరి 1వ తేదీ నుండి బ్రిక్స్ భద్రతా మండలి నాయకత్వ బాధ్యతలను భారత్ స్వీకరించనుంది. ప్రపంచ రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యత ఉన్న ఈ సమయంలో అమెరికా అనుసరిస్తున్న కఠిన వైఖరి కారణంగా భారత్, చైనా, రష్యా వంటి దేశాలు ఊహించని విధంగా ఏకమయ్యాయి. ఈ మూడు దేశాలనూ డొనాల్డ్ ట్రంప్ వ్యతిరేకిస్తుండటంతో.. అవి మరింత దగ్గరయ్యాయి. ఇది బంగారం మార్కెట్ నుండి ముడి చమురు మార్కెట్ వరకు ప్రపంచ స్థాయి ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని నిపుణులు భావిస్తున్నారు. బ్రిక్స్ దేశాల ఉత్పత్తులపై 100% పన్ను విధిస్తానని ట్రంప్ చేసిన హెచ్చరికలే ఈ దేశాలన్నీ ఏకం కావడానికి ప్రధాన కారణమయ్యాయి. బంగారం మరియు ముడి చమురుపై పట్టు: ఏ దేశానికైనా రాజకీయ బలం అనేది ముడి చమురు ఉత్పత్తి, బంగారు నిల్వలు, ఆర్థిక శక్తి మరియు ఆహార స్వయంసమృద్ధిపై ఆధారపడి ఉంటుంది. ఈ నాలుగు కీలక అంశాల్లో 11 బ్రిక్స్ దేశాలు గణనీయమైన వాటాను కలిగి ఉన్నాయి. ముడి చమురు: 2024 నివేదిక ప్రకారం ప్రపంచ ముడి చమురు ఉత్పత్తిలో 42 శాతం బ్రిక్స్ దేశాల నుండే వస్తోంది. ఇందులో సౌదీ అరేబియా, రష్యా, ఇరాన్, చైనా మరియు యూఏఈ ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. బంగారం: ప్రపంచ కేంద్ర బ్యాంకుల వద్ద ఉన్న బంగారు నిల్వలలో చైనా, రష్యా కలిపి 14 శాతానికి పైగా కలిగి ఉన్నాయి. మొత్తం బ్రిక్స్ దేశాల వాటా దాదాపు 20 శాతంగా ఉంది. గృహాల్లో ఉన్న బంగారాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటే భారత్ వాటా అన్ని దేశాల కంటే ఎక్కువగా ఉంటుంది. ఆర్థిక శక్తి మరియు ఆహార భద్రత: ప్రపంచ బ్యాంకు 2024 గణాంకాల ప్రకారం చైనా, భారత్, బ్రెజిల్, రష్యా ప్రపంచంలోని టాప్ 11 అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఉన్నాయి. ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ దేశాల వాటా సుమారు 29 శాతంగా ఉంది. యుద్ధాలు లేదా ఆర్థిక సంక్షోభాల సమయంలో ఆహార స్వయంసమృద్ధి అనేది దేశాలను కాపాడుతుంది. ప్రపంచ ఆహార ఉత్పత్తిలో దాదాపు సగానికి పైగా బ్రిక్స్ దేశాలదే వాటా. చైనా 24 శాతం, భారత్ 12 శాతం ఉత్పత్తిని కలిగి ఉన్నాయి. భారత్ నాయకత్వం – భవిష్యత్తు వ్యూహాలు: డొనాల్డ్ ట్రంప్ పన్ను విధానాల నేపథ్యంలో బ్రిక్స్ దేశాలు తమ మధ్య సహకారాన్ని పెంచుకుంటున్నాయి. ముఖ్యంగా భారత్ మరియు రష్యాలు మరింత సన్నిహితమయ్యాయి. ఇలాంటి కీలక తరుణంలో భారత్ బ్రిక్స్ భద్రతా మండలి బాధ్యతలు స్వీకరించడం అనేది అంతర్జాతీయ మార్కెట్లలో పెను మార్పులకు సంకేతంగా మారుతోంది. ఇది బంగారం ధరలు పెరగడానికి కూడా ఒక కారణం కావచ్చు.

# సంపాదకీయం

## చందనం మార్కెట్ లో భారత్ కు ఏమైంది?

ఎర్ర చందనంపై 'పుష్ప'ల ప్రభావం ఓ రేంజ్ లో ఉందని అంటారు. ఇదే క్రమంలో చందన మార్కెట్ లో భారత ప్రాభవం కోల్పోయినట్లు కేంద్ర ప్రభుత్వం నియమించిన శాండల్ వుడ్ డెవలప్మెంట్ కమిటీ తన నివేదికలో పేర్కొంది. దీనికి గల ప్రధాన కారణం ఈ వృక్షజాతిని విపరీతంగా నరికేయడమేనని అంటున్నారు. ఫలితంగా మేలురకం జాతులు అంతరించిపోతున్నాయని చెబుతున్నారు. అవును... దక్షిణ భారతదేశంలోని కర్ణాటక, కేరళ, తమిళనాడుల్లో అత్యధికంగా పెరిగే చందనం మొక్కలను విపరీతంగా నరికేయడం వల్ల మేలురకం జన్యురకాలు అంతరించి, నాసి రకం జాతులు మిగిలినట్లు శాండల్ వుడ్ డెవలప్మెంట్ కమిటీ వెల్లడించింది. ఒకవైపు సరఫరా తగ్గి, అంతర్జాతీయ మార్కెట్ లో చందనానికి డిమాండ్ విపరీతంగా పెరిగిందని పేర్కొంది. ఒకప్పుడు ప్రపంచవ్యాప్తంగా చందనం మార్కెట్ లో ఓ వెలుగు వెలిగిన భారత ప్రభావాన్ని పునరుద్ధరించాలంటే, మన ప్రభుత్వాలు జోక్యం చేసుకుని దేశంలో చందన మొక్కల పెంపకంపై దృష్టి సారించాలని కమిటీ సూచించింది. ప్రస్తుతం ఆస్ట్రేలియా కంపెనీలు ప్రపంచవ్యాప్తంగా 70% మార్కెట్ వాటాను గుప్పిట్లో ఉంచుకున్నట్లు ఈ నివేదిక వెల్లడించింది. వాస్తవానికి ఒకప్పుడు ప్రధాన చందన తైలం ఉత్పత్తిదారుగా ఉన్న భారత్.. క్రమంగా భారీ దిగుమతిదారుగా మారింది. తాజా ఘణాంకాలు ఆ పరిస్థితిని క్లియర్ గా చూపిస్తున్నాయి. ఇందులో భాగంగా... 2023-24లో మనదేశం నుంచి 0.62 మిలియన్ డాలర్ల విలువైన చందనం ఎగుమతి జరిగితే దిగుమతులు మాత్రం 5.59 మిలియన్ డాలర్లు జరిగాయి. ప్రపంచ వ్యాప్తంగా చందన మార్కెట్ విస్తరిస్తోంది. ఇందులో భాగంగా... 2023లో 265.8 మిలియన్ డాలర్ల మేర ఉన్న ఈ మార్కెట్, 2030 నాటికి 502.2 మిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉంది. ఈ ఏడేళ్లలో 9.4% మేర వార్షిక వృద్ధిరేటు నమోదు చేస్తుందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని.. దేశంలో అమూల్యమైన ఈ వనరుపై దృష్టిసారించాలని చెబుతున్నారు! ఈ నేపథ్యంలో... కేంద్ర పర్యావరణ, అటవీశాఖ భారత అటవీచట్టం 1927ని సవరించి, పంట పొలాల్లో పెంచిన చందన మొక్కలను అటవీ ఉత్పత్తుల నుంచి తొలగించాలని.. ఆర్థిక సంస్థలు ఈ మొక్కల పెంపకానికి అవసరమైన రుణాలు ఇవ్వడంతో పాటు, బీమా సౌకర్యం కల్పించాలని, అన్నిరకాల ప్రోత్సాహకాలు అందించాలని కోరుతున్నారు. ఇదే క్రమంలో... చందన మొక్కల పెంపకం కోసం సంస్థాగతంగా రుణ సౌకర్యం, ప్రోత్సాహకాలు, బీమా సౌకర్యం కల్పించేందుకు కేంద్ర పర్యావరణం, అటవీ, ఆయుష్ మంత్రిత్వశాఖలు చర్యలు తీసుకోవాలని.. అన్ని రాష్ట్రాల్లో ఒకే విధానం అమలయ్యేలా చూడాలని చెబుతున్నారు. వాస్తవానికి.. చందనం చెట్లు ప్రధానంగా కర్ణాటక, కేరళ, తమిళనాడుల్లో ఎక్కువగా పెరుగుతాయి. అయితే.. ఈ వనరుకున్న ప్రాధాన్యాన్ని గుర్తించకుండా విపరీతంగా కొట్టేయడంతో నాణ్యమైన జాతులన్నీ అంతరించిపోయి, నాసిరకం సరుకు మిగిలిపోయింది. ఈ లోపాన్ని అధిగమించాలంటే మళ్లీ మేలురకం మొక్కల పెంపకంపై దృష్టిసారించాలని సూచిస్తున్నారు. దీనికోసం ప్రధానంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని అంటున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్ లాంటి రాష్ట్రాల్లో చాలా ప్రైవేటు సంస్థలు, సంఘాలు, రైతులు వాణిజ్యపరంగా పెద్దసంఖ్యలో మొక్కల పెంపకం చేపట్టారు. దీనివల్ల పంటపొలాల్లో ఈ మొక్కల పెంపకం 30,000 హెక్టార్ల దాకా చేరే అవకాశం ఉందని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం మాజీ ఐఏఎస్ అధికారి రతన్ పి.వాటాల్ నేతృత్వంలో శాండల్ వుడ్ డెవలప్మెంట్ కమిటీ ఏర్పాటుచేసింది. ఆ కమిటీ ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న పరిస్థితులన్నింటినీ సమీక్షించి ఇప్పుడున్న విధానాలు, న్యాయపరమైన నిబంధనావళిలో మార్పులు సూచిస్తూ సిఫార్సులు చేసింది.

# ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని భక్తులతో పోటెత్తిన అలియాబాద్ రత్నాలయం..

### రత్నాలయంలో ఉత్తర ద్వారం ద్వార కలియుగదైవం శ్రీవేంకటేశ్వరస్వామి దర్శించుకున్న వేలాది మంది భక్తులు
### భక్తులతో కిటికిటలాడిన దేవాలయాలు







శామీర్ పేట, డిసెంబర్ 30 (గరుడ వార్త) : ముక్కోటి ఏకాదశి(వైకుంఠ) పర్వదినం సందర్భంగా మంగళవారం కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామిని అలియాబాద్ రత్నాలయంలో వేలాదిగా భక్తజనంఉత్తర ద్వారం గుండా భక్తి శ్రద్ధలతో దర్శించుకొని తరించారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉమ్మడి శామీర్ పేట మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అలియాబాద్ చౌరస్తా సమీపంలోని రత్నాలయం వేలాది మంది భక్తులతో బారులు తీరింది. రత్నాల యంలోకి ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు వేల మంది భక్తులు కుటుంబ సమేతంగా విచ్చేసి ఎంతో భక్తిశ్రద్ధలతో ఉత్తర ద్వారం గుండ రత్నాలయంలోకి ప్రవేశించి కలియుగదైవం శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకుని అర్చన, ప్రత్యేక పూజలను చేశారు. అలాగే అలియాబాద్ చౌరస్తా సమీపంలోని శ్రీ రమాసహిత సత్యనారాయణస్వామి ఆలయంలో, తూంకుంటలోని శ్రీవేంకటేశ్వ రస్వామి ఆలయంలో, దేవరయంజాల్ శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో, తూముకుంట లోని శ్రీగాయత్రి మహాక్షేత్రం, అలియాబాద్ లోని శ్రీసీతారామచంద్రస్వామి, శామీర్ పేట లోని శ్రీభవాణిరామ లింగేశ్వర స్వామి ఆలయంలో లక్ష్మీనారాయణస్వామిలకు, శ్రీభవాణిరామలింగేశ్వరస్వామికి ప్రత్యేకపూజలు చేశారు. శామీర్ పేట శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి, శ్రీ కట్ట మైసమ్మ తల్లి అమ్మవార్లను, శ్రీ రామాలయంలోని స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. మురహరి పల్లి పరిధిలో ని శ్రీ హరిహర దేవాలయం కేశవరం శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి, మూడు చింతలపల్లి లోని శ్రీహరి హర దేవాలయాలలో ఎంతో భక్తి శ్రద్ధల తో, ఆనందోత్సవాలతో భక్తులు కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వ రస్వామిని దర్శించుకుని, కొలుస్తు ముక్కోటి పర్వదినం జరుపుకున్నారు.

# 32 ఏళ్లు - 12వేల మందికి విలు విద్య శిక్షణ

### నేడు పదవీ విమరణ పొందనున్న హకీంపేట క్రీడా పాఠశాల విలువిద్య కోచ్






శామీర్ పేట, డిసెంబర్ 30( గరుడ వార్త) : శిక్షణ తన లక్ష్యంగా గత 32 ఏళ్లుగా బిల్లు విద్యా బోధన చేసిన డాక్టర్ పల్లెల రవిశంకర్ ఈరోజుతో పదవి విరమణ పొందనున్నారు. హకీంపేట క్రీడా పాఠశాలలో విలువిద్య క్రీడాకారులు ఒలింపిక్ క్రీడలే లక్ష్యంగా నిత్యం సాధన చేస్తు యూత్ ఒలింపిక్ లో పతకాన్ని సాధించేలా 32 ఏళ్లుగా 12వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. భారతదేశంలోనే విలువిద్యపై పిహెచ్ డీ చేసిన ఏకైక కోచ్ గా డాక్టర్ పల్లెల రవిశంకర్ బుధవారం పదవీ విరమణ చేస్తున్నందున పూర్వ విద్యార్థులు క్రీడా పాఠశాలలో భారీ ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో తమ సత్తా చాటేలా శిక్షణ ఇచ్చిన విలువిద్య కోచ్ డాక్టర్ పల్లెల రవిశంకర్ శిష్యులు ప్రస్తుతం విలువిద్య కోచులుగా, రైల్వే, పోలీసు, శాస్త్రవేత్తలు, ఎక్సైజ్, ఆర్మీ వివిధ రంగాల్లో ఉద్యోగులుగా దేశానికి సేవలు అందిస్తున్నారు. ఒలింపిక్ లో భారత భాగస్వామ్యమే లక్షంగా విద్యార్థులను తీర్చిదిద్దారు. పతకాలను జాతీయ స్థాయిలో 160, అంతర్జాతీయ స్థాయిలో 13బంగారు పతకాలు, రాష్ట్ర జిల్లా స్థాయిలో వేల సంఖ్యలో బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించేలా ప్రోత్సహించాడు. ఈనేపథ్యంలో 2024-2025లో జిల్లా స్థాయిలో 612 మంది, రాష్ట్ర స్థాయిలో 435, జాతీయ స్థాయిలో 121, అంతర్జాతీయ స్థాయిలో 7 మంది క్రీడాకారులు బంగారు, వెండి కాంస్య పతకాలు సాధించి హకీంపేట క్రీడా పాఠశాలను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలోనే నిలిచేలా ప్రోత్సహించారు.

2024- 2025లో విలు విద్యలో హకీంపేట క్రీడా పాఠశాల సాధించిన పతకాల పట్టిక....

పతకాలు : బంగారు - వెండి- కాంస్యం
జిల్లా స్థాయి: 222- 207- 183
రాష్ట్ర స్థాయి: 191- 129 -115
జాతీయ స్థాయి: 22 -39 -60
అంతర్జాతీయ స్థాయి: - 04- 02 -01

ఉద్యోగానికే విరమణ విలు విద్యలో విద్యార్థులకు నిత్యం అందుబాటులో ఉంటా : డాక్టర్ పల్లెల రవిశంకర్, విలు విద్యా కోచ్, హకీంపేట క్రీడా పాఠశాల... విద్యార్థిలో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు వారిలో ఉన్న ఆసక్తి గుర్తించి అందుకు అనుగుణంగా శిక్షణ నిత్య పర్యవేక్షణతో విద్యార్థుల పొరపాట్లను గుర్తించి వెంటనే నివృత్తి చేసి రెండో సారి తప్పు జరుగకుండా ప్రోత్సహం తన వయస్సుతో పదవీ విమరణ పొందుతున్నప్పటికి విలు విద్యలో విద్యార్థులకు జీవితాంతం వరకు అండగా ఉంటానన్నారు.

# పెద్ద చెరువులో ఓ వ్యక్తి మృతదేహం లభ్యం

శామీర్ పేట, డిసెంబర్ 30( గరుడ వార్త) : శామీర్ పేట పెద్ద చెరువులో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట జిల్లా, గజ్వేల్ కు చెందిన సర్వ చిరంజీవి(45) ఇంటర్నెట్ షాప్ నిర్వహిస్తూ కుటుంబ సభ్యులతో జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 24న గోవాకు వెళ్తున్నానని తన భార్యకు చెప్పి గజ్వేల్ లోని తన ఇంటి నుంచి వెళ్లాడు. ఈనెల 27న చిరంజీవి మొబైల్ నంబర్‌కు కాల్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో అతని ఆచూకీ కోసం వెతికినప్పటికీ సమాచారం లభించలేదు. దీంతో ఈనెల 27న గజ్వేల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. 30న మధ్యాహ్నం స్థానికులు శామీర్ పేట పెద్ద చెరువులో వ్యక్తి మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. శామీర్ పేట పోలీసులు ఈ విషయాన్ని చిరంజీవి అల్లుడు అయిన మహంకాళి ఉదయ్ కుమార్‌కు సమాచారం అందించారు. అతను సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా, మృతదేహం తన మామ అయిన సర్వ చిరంజీవిదిగా గుర్తించాడు. కాగా ఆర్థిక కారణాలు, ఇతర కారణాల వల్ల మనస్తాపానికి గురై మృతి చెందివుండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహానికి పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు శామీర్ పేట పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ

శామీర్ పేట, డిసెంబర్ 30 (గరుడ వార్త) : శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించు





కున్నారు. ఆలయం వద్ద శామీర్ పేట లోని టెన్నిస్ కోర్ట్ నిర్వాహకులు సత్య రాము - పూన్ గుతలి దంపతులు ( చెన్నై) ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టగా శామీర్ పేట కు చెందిన దూడల బాల్ రాజు గౌడ్ - మణెమ్మ దంపతులు, బండి బాల్ రాజు గౌడ్- మహేశ్వరి దంపతులు అన్నదానానికి సహకరించారు. ఎల్లమ్మ తల్లి ఆలయానికి విచ్చేసే భక్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

# వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని వెంకన్నను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే మైనాంపల్లి హనుమంతరావు, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్...

శామీర్పేట (గరుడ వార్త) : ఉద్ధమర్రిలోముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉద్దమర్రి శ్రీ విష్ణు శివాలయంలో భక్తులు త్వర ద్వారం గుండా స్వామి వారిని దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్ రెడ్డి, జిల్లా ఆర్టిఏ సభ్యుడు జైపాల్ రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు యాదవ్, మేడ్చలే ఏ బ్లాక్





అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, మూడు చింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్, శామీర్ పేట మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు వైఎస్ గౌడ్, వివిధ పార్టీల నాయకులు, వివిధ ప్రాంతాల భక్తులు స్వామివారిని ఇతర ద్వారం గుండా దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కాగా ఆలయాల వద్ద శామీర్ పేట ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ ఆధ్వర్యంలో బందోబస్తు పోలీస్ సిబ్బంది నిర్వహించారు. ఆలయాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

# న్యూ ఇయర్ సెలెబ్రేషన్స్.. ప్రజలకు గుడ్‌న్యూస్

హైదరాబాద్: న్యూ ఇయర్ వేడుకలను దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ తమ ప్రయాణీకులకు గుడ్‌న్యూస్ చెప్పింది. సాధారణంగా మెట్రో రైళ్లు రాత్రి 11 గంటల వరకు మాత్రమే అందుబాటులో ఉంటాయి. కానీ, కొత్త సంవత్సర వేడుకల్ని దృష్టిలో పెట్టుకుని 31వ తేదీ రాత్రి మెట్రోరైలు వేళలను హెచ్ఎంఆర్ఎల్ పొడిగించింది. బుధవారం అర్ధరాత్రి ఒంటిగంట వరకు మెట్రో రైళ్లు అందుబాటులో ఉండనున్నాయి. ప్రారంభ స్టేషన్‌ల నుంచి రాత్రి ఒంటిగంటకు చివరి మెట్రో రైళ్లు బయలుదేరనున్నాయి. మెట్రో రైలు ప్రయాణీకులు దీన్ని దృష్టిలో పెట్టుకుని తమ జర్నీని ప్లాన్ చేసుకోవాల్సి ఉంటుంది.

# గుంత పూడింది.. వేదన తీరకుంది!

తాండూరు : చేవెళ్ల–మీర్జాగూడ మధ్య నవంబరు 3న ఆర్టీసీ బస్సు–టిప్పర్ ఢీకొనడంతో జరిగిన ఘోర దుర్ఘటనకు కారణమైన గుంత పూడ్చేయగలిగారు కానీ.. చనిపోయిన 19 మంది బాధిత కుటుంబ సభ్యుల వేదనను మాత్రం నేటికీ తీర్చలేకపోతున్నారు. ఘటన జరిగి నేటికి సరిగ్గా 54 రోజులవుతోంది. ఆ ప్రమాదం మా బతుకులను చిదిమేసింది. తెల్లారేసరికి నా అనుకునేవారందరూ దూరమయ్యారు.. ఈ దీన పరిస్థితి ఎవరికీ రాకూడదంటూ గుర్తొచ్చినప్పుడల్లా కన్నీరుమున్నీరవుతూ రోజులు గడుపుతున్నారు. అమ్మా నాన్నలను కోల్పోయి అనాథలైన పిల్లలు.. ముగ్గురు కూతుళ్లను కోల్పోయిన తల్లిదండ్రులు.. మూడు తరాలను దూరం చేసుకున్న కుటుంబాలు.. పిల్లలే ఆధారంగా జీవిస్తున్న కుటుంబం.. ఇలా ఎవరిని కదిలించినా శోకం వర్ణనాతీతం. ఈ ప్రమాదానికి టిప్పర్ యజమానిని ఇటీవల బాధ్యుడిగా చేసిన విషయం తెలిసిందే. వారి పరిస్థితి తెలుసుకునే ప్రయత్నం చేసింది..

**మానసికంగా కుంగిపోయిన సోదరుడు**

యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్‌కు చెందిన అఖిలారెడ్డి మాదాపూర్‌లోని ఐఐఆర్ఎం కళాశాలలో ఎంబీఏ చదువుతోంది. కళాశాల టాపర్. రూ.24 లక్షల ప్యాకేజీతో ఉద్యోగావకాశం వచ్చిన సమయంలోనే చరవాణి కోసం ఇంటికి వచ్చి వెళుతుండగా.. బస్సు ప్రమాదంలో కన్నుమూసింది. కళాశాలలో అఖిలారెడ్డి పేరిట స్మృతి వనాన్ని ఏర్పాటు చేశారు. ఫీజు మొత్తం తిరిగిచ్చేశారు. సోదరి మృతితో కలతచెందిన సోదరుడు సందీప్‌కుమార్‌రెడ్డి మానసికంగా ఇబ్బంది పడ్డారు. పైచదువులకు యూకే వెళ్లాల్సి ఉండగా వాయిదా వేసుకున్నారు. తాండూరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో మానసిక వైద్య



నిపుణురాలి వద్ద చికిత్స పొందారు.

**ఆర్థికసాయం అందజేత**

మృతి చెందిన 19 మంది కుటుంబాలకు రూ.20 లక్షల చొప్పున, 24 మంది క్షతగాత్రులకు రూ.2 లక్షల చొప్పున ప్రభుత్వం అందజేసింది. బస్సు డ్రైవర్ దస్తగిరి ఇద్దరు భార్యలకు, తల్లికి మూడు భాగాలుగా పరిహారం అందించారు.

**రహదారి విస్తరణ పనుల్లో వేగం**

ఘోర దుర్ఘటన తరువాత ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం మేల్కొంది. రంగారెడ్డి జిల్లా మన్నెగూడ నుంచి చేవెళ్ల, మొయినాబాద్ రోడ్డును వెడల్పు చేస్తోంది. ప్రమాదంతో ఈ దారికి మోక్షం లభించడం దురదృష్టకరమని ప్రయాణికులు, వాహనదారులు చర్చించుకుంటున్నారు.

**నిద్రలో అమ్మానాన్నలు గుర్తొస్తున్నారు**

శివలీల, భవానీ, హాజీపూర్, యాలాల మండలం

అమ్మానాన్న(బందెప్ప, లక్ష్మి) దూరమైన తరువాత బంధువులే దిక్కయ్యారు. అయినా.. రాత్రుళ్లు నిద్రలో ఒక్కసారిగా అమ్మానాన్నలు గుర్తొచ్చి మెలకువ వస్తోంది. ఘటనా స్థలం, అమ్మానాన్న మృతదేహాలు కళ్లలో మెదులుతున్నాయని ఇద్దరు పిల్లలు కంటనీరు పెట్టుకున్నారు. వీరిని దత్తత తీసుకున్న ఓ సంస్థ చదువు, బాగోగులకు ఆర్థికసాయం అందిస్తోంది.

**ఎక్కడికెళ్లినా అదే గుర్తొస్తోంది...**

ఎల్లయ్యగౌడ్, పేర్కంపల్లి, యాలాల మండలం

ఈ ఘటనలో నా ముగ్గురు కుమార్తెలు నందిని, సాయిప్రియ, తనూషలను కోల్పోయా. నా బాధ ఎవరికీ రావొద్దు. పొద్దున్నే లేచి సొంత వాహనంపై కిరాయి తోలుతూ జీవిస్తుండేవాణ్ని. ప్రస్తుతం ఎక్కడికెళ్లినా అదే ఘటన గుర్తుకొస్తోంది. ఆ ఆలోచనలతో డ్రైవింగ్ చేస్తున్నప్పుడు ఏదైనా జరిగితే నావల్ల ఇతరులు ఇబ్బంది పడే ప్రమాదం ఉందని వాహనం తోలడం మానేశా.

# ఉపకార వేతనం.. విద్యార్థులకు ప్రయోజనం

బొంరాస్‌పేట: పేద, మధ్య తరగతికి చెందిన కుటుంబాల విద్యార్థులకు చేయూతనందించేందుకు, డ్రాపౌట్స్ తగ్గించడానికి ప్రభుత్వం ఏటా ఉపకార వేతనాలు అందిస్తోంది. ఇవన్నీ కేవలం ఇంటర్, డిగ్రీ ఆపై చదివే విద్యార్థులకే అన్న అభిప్రాయం చాలా మందిలో ఉంది. అవగాహన లేక దరఖాస్తు చేసుకోవడం లేదు. 2025–26 విద్యా సంవత్సరానికి ప్రభుత్వం ఎస్సీ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాలల విద్యార్థులకు రెండు రకాలుగా ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌లను అందించడానికి దరఖాస్తులు కోరుతోంది.

**వీరు అర్హులు..**

ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లోని ఎస్సీ విద్యార్థులు అర్హులు. ఈ నెలాఖరులోగా %http:telangana.epass.cgg.gov.in%–లో దరఖాస్తు చేసుకోవాలి. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.2.50 లక్షల్లోపు ఉండాలి. ఆదాయం, కులం, ఆధార్‌కార్డు, తపాలాశాఖలో తెరిచిన ఖాతా పుస్తకం, బోనాఫైడ్ జిరాక్సులను, విద్యార్థి ఫొటోను జత చేసి జిల్లా కార్యాలయంలో ఒక కాపీ అందించాలి. డబ్బులు నేరుగా విద్యార్థుల ఖాతాల్లో జమ అవుతాయి.

**రెండు రకాలుగా..**

5– 8వ తరగతి చదువుతున్న బాలికలకు ఏడాదికి రూ.1500, బాలురకు రూ.1000 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. 9, 10వ తరగతుల వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50 శాతం చొప్పున భరించి రూ.3500 చొప్పున ఇస్తున్నాయి. ఒకసారి దరఖాస్తు చేసుకుంటే 10వ తరగతి వరకు అందుతాయి. జిల్లాలో ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలలు 1271 ఉన్నాయి. ఇప్పటి వరకు 1100 పాఠశాలలు నమోదు చేసుకున్నాయి. 171 ప్రైవేటు బడులు ఇంకా రిజిస్టరు చేసుకోలేదు. జిల్లా నుంచి 2100 మంది విద్యార్థులను దరఖాస్తు చేయించాలన్నది లక్ష్యం. ఇప్పటి వరకు 1450 మంది దరఖాస్తు చేసుకున్నారు.

**సద్వినియోగం చేసుకోవాలి..**

విద్యార్థులకు ప్రభుత్వం అందించే ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌లను సద్వినియోగం చేసుకోవాలి. ఈ నెలాఖరులోపు అందరూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

కమలాకర్‌రెడ్డి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి

# సఖ్యత.. ఐక్యత.. పల్లెభవిత




మెదక్: ఈ పరిస్థితులు పల్లె ప్రగతికి అవరోధం కానున్నాయి. సర్పంచులే రథసారథులుగా పార్టీలకతీతంగా గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి, ఆర్థిక వనరులు సమకూర్చుకోవాలి. అభివృద్ధికి కృషి చేస్తూ, సంక్షేమ పథకాలను ప్రజలకు అందించాలి. బాధ్యతలు, విధుల నిర్వహణలో పారదర్శకత పాటించాలి. ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించాలి. అధికారులు, పాలకవర్గ సభ్యులు, కార్యదర్శులతో సమన్వయంగా సాగితేనే ఫలితం ఉంటుంది.

**వార్డుసభ్యుల మద్దతు**

గ్రామాభివృద్ధికి అవసరమైన నిర్ణయాలు కార్యరూపంలోకి రావాలంటే పంచాయతీ పాలకవర్గ సమావేశ తీర్మానం తప్పనిసరి. ఇందుకు వార్డుసభ్యుల మద్దతు అవసరం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మంజూరైన నిధులు వినియోగించేందుకు పాలకవర్గ తీర్మానంతో పాటు పనుల కమిటీ నియామకం చేపట్టాలి.

**కార్యదర్శుల ముఖ్యభూమిక**

నూతన పంచాయతీరాజ్ చట్టం–2018 ప్రకారం పంచాయతీలో కార్యదర్శి ముఖ్యభూమిక పోషిస్తున్నారు. సర్పంచి, కార్యదర్శి మధ్య సమన్వయం ఉంటేనే పాలన పరుగులు పెట్టనుంది. ఘర్షణ వాతావరణం ఉంటే అధికారులకు ఇబ్బందికరం.

**అందరినీ కలుపుకొని**

కార్యదర్శితో సఖ్యతగా మెలిగితేనే ప్రభుత్వం నిర్దేశించిన పనులు గడువులోగా పూర్తికానున్నాయి. నిధుల సమీకరణ సులువు అవుతుంది. గ్రామ పరిపాలనాధికారి(జీపీవో) వ్యవసాయ విస్తరణాధికారి (ఏఈవో)తో పాటు అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బందితో పాటు ఉపాధ్యాయులు, ఇతర విభాగాల సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ సర్పంచి ముందుకు సాగాలి.

గ్రామ స్వరాజ్యం సాధనలో పంచాయతీరాజ్ వ్యవస్థ కీలకమైంది. ఈ వ్యవస్థకు దిశానిర్దేశం చేసేది ప్రజాప్రతినిధులు. అధికారులతో సమన్వయం, ఆర్థిక స్వావలంబన ఉన్నప్పుడే గ్రామీణాభివృద్ధి, దేశాభివృద్ధి సాధ్యమవుతుంది. – మహాత్మా గాంధీ

పార్టీలకు అతీతంగా పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నప్పటికీ ప్రధాన రాజకీయ పార్టీల జోక్యం పెరిగిపోయింది. వార్డుసభ్యుడి నుంచి మొదలుకొని సర్పంచి వరకు ప్రతి ఒక్కరు ఏదో రాజకీయపార్టీ మద్దతు తీసుకోవాల్సిన పరిస్థితి తలెత్తుతోంది.

సంగారెడ్డి జిల్లా కంది మండలం కాశీపూర్, కొండాపూర్ మండలం అనంతసాగర్‌లో పాలకవర్గాల సభ్యుల ప్రమాణ స్వీకారం సైతం వేర్వేరుగా చేయడమే ఇందుకు నిదర్శనం.

ఇదే మాదిరిగా ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల్లో వార్డుసభ్యులు వర్గాలుగా విడిపోయిన ఘటనలు ఉన్నాయి. పలు గ్రామాల్లో సర్పంచులు అధికార పార్టీ మద్దతుదారులమని తాము చెప్పినట్లు కార్యదర్శులు, ఇతర శాఖల అధికారులు నడుచుకోవాలని హెచ్చరికలు జారీచేస్తున్నారు. ప్రతిపక్ష పార్టీల మద్దతుదారులైన కొందరు సర్పంచులు కార్యదర్శులు తమ ఆధ్వర్యంలోనే విధులు నిర్వహించాలంటున్నారు.

# అడిగేవారేరి.. అంతా మా ఇష్టం..!



మధిర : జిల్లాలోని వివిధ గ్రామాలు, మండల కేంద్రాల్లో దుకాణాలు, వ్యాపార సముదాయాలు ఉన్నప్పటికీ ఆ స్థాయిలో ట్రేడ్ లైసెన్సుల సంఖ్య మాత్రం పెరగటం లేదు. పంచాయతీల ఆదాయానికి గండి పడుతోంది. పెద్ద పంచాయతీల్లో, మండల కేంద్రాల్లో ట్రేడ్ లైసెన్స్ లేని దుకాణాలపై అధికారులు పూర్తిస్థాయిలో దృష్టిసారిస్తే పంచాయతీలకు ఆదాయం సమకూరే అవకాశాలు మెరుగుపడతాయి.

**పంచాయతీల ఆదాయం కరవు..**


జిల్లాలో 20 మండలాల్లో 571 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పంచాయతీలకు కళ్లెదుటే ఆదాయ మార్గాలున్నా.. అధికారులు వాటిపై దృష్టి కేంద్రీకరించటంలేదు. దీనిపై వివిధ వర్గాల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పెద్ద పంచాయతీలు, మండల కేంద్రాల్లో ఇళ్లలో నిర్వహిస్తున్న దుకాణాల నుంచి పూర్తిస్థాయిలో ట్రేడ్ లైసెన్స్‌లు వసూలు చేయటం లేదు. గృహాల్లోనే వివిధ వ్యాపారాలు సాగిస్తున్నారు. కొందరు ఇప్పటికీ గృహావసరాల దుకాణాల పేరుతోనే పన్నులు చెల్లిస్తున్నారు. అందుకే పంచాయతీలకు ఆదాయం తగ్గుతోంది. గ్రామాల్లో వ్యాపారాలు కొనసాగించేవారు ట్రేడ్ లైసెన్సులు తీసుకుంటే ఆయా పంచాయతీలకు ఆర్థిక వనరులు సమకూరుతాయి. ప్రగతికి ఊతమవుతాయి. అంతేగాక లైసెన్సులు పొందితే ఆయా వ్యాపారులకు ప్రభుత్వ పథకాల ద్వారా మరింత ఆర్థిక భరోసా దక్కనుంది. ఆధ్యాత్మిక క్షేత్రాలు ఉన్న గ్రామాల్లో సైతం తక్కువ సంఖ్యలోనే ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకుంటున్నారు. ఆలయాల పరిసర ప్రాంతాల్లో దుకాణాలు ఏర్పాటు చేసి వ్యాపారాలు నిర్వహిస్తున్నా కొందరు అనుమతులు తీసుకోవటం లేదు. తెలంగాణ చిన తిరుపతిగా పేరొందిన జమలాపురం పుణ్యక్షేత్రంలో వందల కొద్దీ దుకాణాలు నిర్వహిస్తున్నా కొందరే లైసెన్సులు పొందారు. తెలుగు రాష్ట్రాల నుంచి నిత్యం వందలాది మంది భక్తులు ఆలయానికి వస్తుంటారు. వ్యాపార లావాదేవీలు రూ.లక్షల్లోనే సాగుతుంటాయి. ప్రతి ఒక్కరూ లైసెన్సులు తీసుకుంటే ఇక్కడి పంచాయతీకి ఆదాయం మెరుగుపడి అభివృద్ధి పనులకు ఖర్చుచేసే అవకాశం ఉంటుంది.

కొన్ని గ్రామాల్లో కొందరు తమ ఇళ్ల ముందు దుకాణాలకు గదులు నిర్మించి వ్యాపారానికి అద్దెకు ఇచ్చి ఆదాయం పొందుతున్నారు. అయినా ఇంటికే పన్నులు చెల్లిస్తున్నారు. ఇటీవల కొంతకాలంగా గ్రామాల్లో ట్రేడ్ లైసెన్స్‌లపై అధికారులు దృష్టి సారించారు. ఇది పూర్తి స్థాయిలో అమలైతే ఆదాయం సమకూరుతుంది.

మేజర్ గ్రామ పంచాయతీలతో పాటు పంచాయతీల్లోనూ వ్యాపారాలు నిర్వహించే దుకాణదారులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలి. తద్వారా ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయి. చిరు వ్యాపారులకు భరోసాగా ఉంటుంది. గ్రామాల్లో ఆదాయం సమకూరి అభివృద్ధికి తోడ్పాటుగా నిలుస్తుంది. ఎవరైనా లైసెన్సులు తీసుకోకుండా వ్యాపారాలు కొనసాగిస్తుంటే ఆయా దుకాణాలను సీజ్ చేస్తాం.

ఆశాలత, జిల్లా పంచాయతీ అధికారి

# 'నడిపేవారు' లేక నిలిపేశారు!



నర్సాపూర్: నర్సాపూర్ డిపోలో డ్రైవర్ల కొరత వేధిస్తోంది. ప్రస్తుతమున్న బస్‌లకే సరిపోవడం లేదు. మరికొద్ది రోజుల్లో కొత్తగా బస్సులు వచ్చే అవకాశం ఉంది. వాటిని ఎలా నడపాలో అర్థం కాక ఆర్టీసీ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. మరోవైపు ప్రయాణికులు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్న వారిపై అదనపు భారం మోపుతున్నారు. నర్సాపూర్‌లో డిపోను మూడేళ్ల క్రితం ప్రారంభించారు. 27 సంస్థ సర్వీసులు(ఇవన్నీ పల్లెవెలుగులే), 3 అద్దెవి(నిర్వాహకుల చోదకులే) ఉన్నాయి. వీటికి సంస్థ పరంగా కండక్టర్లు ఉంటారు. డిపో ప్రారంభంలో అన్నీ పాత డొక్కు బస్సులనే అందుబాటులో ఉంచగా అవి క్రమంగా శిథిలావస్థకు చేరుకోవడంతో వాటిని తొలగిస్తూ 15 వరకు కొత్తవి పంపారు. దీంతో మొత్తం 27 బస్సులున్నాయి. వీటిని నడిపేందుకు 36 మంది డ్రైవర్లున్నారు. ఇద్దరు మెడికల్ లీవ్‌లో ఉన్నారు. మిగిలింది 34 మంది. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా 44 మంది అవసరం ఉండగా ఇంకా 10 మంది తక్కువగా ఉన్నారు. ఉన్న వారిలో ఎవరైనా ఆరోగ్య సమస్యలతో రాకపోతే ఆ రోజు బస్సులు డిపోకే పరిమితం అవుతాయి. దీంతో ఎక్కువగా నర్సాపూర్–బాలనగర్, నర్సాపూర్–జోగిపేట, నర్సాపూర్–పటాన్‌చెరుకు వెళ్లే ప్రయాణికులు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే వారికి ఇబ్బందులు తప్పవు. బస్సుకు ముగ్గురు చోదకులు అందుబాటులో ఉండాలన్న నిబంధన కనిపించడం లేదని విమర్శలున్నాయి. అప్పుడప్పుడు ఉన్న వారికే అదనంగా డ్యూటీలు వేస్తూ నెట్టుకొస్తున్నారు.

**ఉన్నవారితోనే సర్దుబాటు చేస్తున్నాం**

డ్రైవర్ల కొరత ఉందని ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రస్తుతం ఉన్న వారితోనే సర్దుబాటు చేస్తున్నాం. కొత్తగా నియామకం జరిగితేనే సమస్యలు తీరుతాయి. వారంతపు సెలవుల్లో ఉన్నవారికి అదనపు డ్యూటీలు వేస్తున్నాం. ఇందుకు అదనంగా చెల్లిస్తున్నాం. డ్రైవర్లపై పనిభారం పడుతున్నది వాస్తవమే. ఔట్‌సోర్సింగ్ పద్ధతిన నియామకాలు చేపడుతున్నాం. హెవీ డ్రైవింగ్ లైసెన్సు కలిగిన వారికి అవకాశం ఇస్తున్నాం.

లక్ష్మణ్, డిపో పర్యవేక్షకులు

# ఆరుబయట వాహనం.. సెల్లార్‌లో వ్యాపారం!

సూర్యాపేట: జిల్లాలోని పురపాలికల్లో సెల్లార్లు వ్యాపార నిలయంగా మారాయి. వాటిలో వాహనాలను నిలుపుకొనే వెసులుబాటు కల్పించాలి. ప్రస్తుతం ఎలక్ట్రానిక్స్, దస్తులు, మెకానిక్, తదితర వాటికి ఉపయోగిస్తున్నారు. ఆసుపత్రి నిర్వాహకులు మాత్రం ల్యాబ్‌లు, ఆపరేషన్ థియేటర్లకు వాడుకుంటున్నారు. దీంతో వాహనదారులు తమ వాహనాలను ఆరుబయటే నిలుపుతున్నారు. జిల్లాలోని ఐదు పురపాలికల్లో 42 వరకు సెల్లార్లున్నాయి. వీటిలో అత్యధికం దుకాణాలు నిర్వహిస్తున్నారు. అందులో ఎవరూ వాహనాలను నిలపడం లేదు. కొందరు నిర్వాహకులు సామగ్రి ఉంచి తాళం వేస్తున్నారు.

**పట్టించుకోని అధికారులు..**

పుర అధికారులు పట్టించుకోకపోవడంతో సెల్లార్ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నిర్మాణ సమయంలో అధికారులకు మామూళ్లు ఇవ్వడంతో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని



ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో వారు ఆడిందే ఆట.. పాడింతే పాటగా వాటిని వినియోగిస్తున్నారు. ఆరుబయట వాహనాల కారణంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. పట్టణాలు రోజురోజుకు విస్తరిస్తుండటంతో వాహనాల వినియోగం పెరిగింది. వివిధ అవసరాల నిమిత్తం చుట్టుపక్కల గ్రామాలవారు తరచూ పట్టణాలకు వస్తుంటారు. ఈ కారణంగా వాహనాలు మళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**చర్యలు తీసుకుంటాం: హన్మంతరెడ్డి, పుర కమిషనర్, సూర్యాపేట**

నిర్వాహకులు తమ సెల్లార్లలో వ్యాపారాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం. వాటిని వాహనాల పార్కింగ్‌కే వినియోగించాలి. తనిఖీలు చేపట్టి వ్యాపారాలు చేయకుండా చూస్తాం. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే శాఖాపరంగా చర్యలు చేపడతాం.

# బల్క్ కనెక్షన్ల ఆదాయం పెంచుకుందాం

హైదరాబాద్ : జలమండలికి అత్యధిక రాబడిని ఇస్తున్న బల్క్ నీటి కనెక్షన్ల నుంచి ఆదాయాన్ని మరింత పెంచుకునేలా కార్యాచరణ రూపొందిస్తోంది. ప్రస్తుతం సుమారు రూ.77 కోట్లు నెలకు బల్క్ కనెక్షన్ల నుంచి రాబడి వస్తుండగా దీన్ని రూ.100 కోట్లకు పెంచేలా దృష్టిసారించింది. జలమండలికి ఆదాయంలో కీలకంగా ఉన్న బల్క్‌కనెక్షన్లు 72 వేలు దాకా ఉన్నాయి. బల్క్ కనెక్షన్లలో బహుళ అంతస్తుల భవనాలు, గేటెడ్ కమ్యూనిటీలు, హైరైజ్ భవనాలతో పాటు వివిధ సంస్థలు ఉన్నాయి. ప్రతినెలా జలమండలికి రూ.130 కోట్లు రాబడి వస్తుండగా ఇందులో అత్యధిక శాతం వాటి నుంచే వస్తోంది. జలమండలికి 14.2 లక్షల కనెక్షన్లు ఉన్నా రాబడి వచ్చే కనెక్షన్లు



1.25 లక్షలు మాత్రమే ఉన్నాయి. సుమారు 8 లక్షల కనెక్షన్లు ఉచిత కనెక్షన్లుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో అత్యధిక రాబడిని ఇచ్చే కనెక్షన్లను పెంచుకోవడం, ఉన్న కనెక్షన్లకు నికరంగా నీటిని సరఫరా చేసి ఆదాయాన్ని సమకూర్చుకోవడం లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ నేపథ్యంలో జలమండలి ఎండీ కె.అశోక్‌రెడ్డి బల్క్ కనెక్షన్‌లపై ప్రత్యేక సమీక్ష చేస్తున్నారు. బల్క్ కనెక్షన్ల నుంచి నీటి వినియోగ ఛార్జీలను కచ్చితంగా వసూలు చేసేలా జనరల్ మేనేజర్ల నుంచి మేనేజర్ల దాకా బాధ్యతలు అప్పగించారు. లక్ష్యం మేరకు ఛార్జీలు వసూలు చేస్తేనే వేతనాలు ఇచ్చే పరిస్థితి ఉందని ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు. గతంలో ఉదాసీనంగా వ్యవహరించడంతో రూ.1700 కోట్లదాకా బకాయిలు ఉన్నాయి. అత్యధికం ప్రభుత్వరంగ సంస్థలతో పాటు ప్రైవేటు సంస్థలు ఉన్నాయి.

# సరళం.. పారదర్శకం

హైదరాబాద్: హెచ్ఎండీఏ పరిధిలోని భూ వినియోగ మార్పిడి(సీఎల్‌యూ) ప్రక్రియ ఇక వేగవంతం కానుంది. పారదర్శకంగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విధానంలో మార్పులు చేస్తూ ప్రభుత్వం తాజాగా జీవో వెలువరించింది. ఇప్పటివరకు సీఎల్‌యూ దరఖాస్తులను మ్యానువల్‌గా సమర్పించేవారు. ఇక నుంచి ఆన్‌లైన్‌లోనే స్వీకరించనుంది. మాస్టర్‌ప్లాన్‌లో ఒక అవసరం కోసం కేటాయించిన భూమిని వేరే వినియోగానికి వాడే సందర్భంలో చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్(సీఎల్‌యూ) తప్పనిసరి. హెచ్ఎండీఏకు దరఖాస్తు చేసుకుంటే క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రత్యేక జీవోతో మాస్టర్‌ప్లాన్‌లో ఆ మేరకు భూ వినియోగ మార్పిడికి అంగీకరిస్తుంది.

సీఎల్‌యూలో మార్పులు ఇలా..ఆన్‌లైన్ దరఖాస్తు స్వీకరించే సమయంలోనే హెచ్ఎండీఏ/టౌన్ అండ్ కంట్రి ప్లానింగ్(డీటీసీపీ), అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీస్ ప్రాసెసింగ్, ఇతర రుసుములు వసూలు చేయాలి దరఖాస్తుతో పాటు తాజా పరిస్థితిని పూర్తి వివరాలతో దస్త్రం ప్రభుత్వం ముందుంచాలి. హెచ్ఎండీఏ లేదా ఇతర అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల నుంచి వచ్చిన సీఎల్‌యూ ప్రతిపాదనలను, 2014లో ఏర్పాటైన సీఎల్‌యూ కమిటీలు పరిశీలించి తర్వాతనే ప్రభుత్వానికి సిఫార్సులు చేస్తారు. కమిటీ సూచనల మేరకు, సంబంధిత మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి మంత్రి ఆమోదం పొందిన తర్వాతే ప్రభుత్వం ఆమోదం లేదా తిరస్కరణపై తుది నిర్ణయం తీసుకుంటుంది.

అభ్యంతరాలు రాకపోతే కన్వర్షన్ ఛార్జీలు వసూలు చేసి, వివరాలు ప్రభుత్వానికి పంపాలి. అభ్యంతరాలు వస్తే వాటిని పరిశీలించి ఆ వివరాలతో నివేదికతో సర్కారుకు తిరిగి తీర్మానాన్ని పంపాలి.

కన్వర్షన్ ఛార్జీలు వసూలు చేసిన తర్వాత ప్రభుత్వం సీఎల్‌యూపై తుది ఉత్తర్వులు జాచేస్తుంది. ఆమోదించిన భూ వినియోగ మార్పులను మాస్టర్‌ప్లాన్‌లో అనుసంధానించేందుకు ఆదేశాలు జారీ చేస్తుంది.

# కాలువల్లో సాగునీరెలా పారేది!

సారంగాపూర్ : ఉపాధిహామీ పథకంలో ఒక్క సారంగాపూర్ మండలంలోనే సాగునీటి కాలువల పూడికతీతతో 3 వేల మంది కూలీలకు పని దొరికేది. కనీసం 10 గ్రామాల్లో చెరువుల పూడికతీత పనులు చేపడితే 20 వేల మందికి కూలీ దొరికేది. ఈ రెండు పనులతో ఒక్క మండలంలోనే ఏటా రూ.1.5 కోట్ల వరకు వేతన రూపంలో కూలీలకు చెల్లించేవారు.

**శాశ్వత పనులకే ప్రాధాన్యం**

కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పేరును 'వీబీ జీ రామ్ జీ(వికసిత్ భారత్ గ్యారంటీ రోజ్‌గార్ అజీవికా మిషన్ (గ్రామీణ్)'గా మార్చింది. దీంతో పాటు పథకంలో సమూల మార్పులు తీసుకొచ్చారు. ఉపాధిహామీలో ఏడాది కాలంగా కాలువల్లో పూడికతీత, కందకాల తవ్వకం, చెరువుల పూడికతీత తదితర పనులను నిలిపేశారు. నూతన చట్టంలో జల భద్రత, మౌలిక వసతుల కల్పన, జీవనోపాధి సృష్టి, వాతావరణ మార్పులను తట్టుకొని నిలిచే పనులకు ప్రాధాన్యమివ్వనున్నారు. జగిత్యాల జిల్లా పూర్తిగా ఎస్సారెస్పీ ఆయకట్టు ప్రాంతం కావడంతో ఏటా ఉపాధిహామీలో కాలువల్లో పూడికతీత పనులు పెద్ద ఎత్తున జరుగుతుండేవి.

జిల్లావ్యాప్తంగా దాదాపు 87 కిలోమీటర్ల మేర కాకతీయ కాలువ, డీ–29 నుంచి డీ–83 డిస్ట్రిబ్యూటరు కాలువలు 232 కిలోమీటర్ల దూరం ఉన్నాయి. అలాగే 137 మైనర్ కాలువలు 468 కిలోమీటర్లు,



126 సబ్ మైనర్ కాలువలు 280 కిలోమీటర్ల పొడవున్నాయి. వీటితో పాటు గ్రామాల్లో పంట పొలాలకు అదనంగా ఫీడర్ కాలువలుంటాయి. ఏటా ఉపాధిహామీలో కూలీలతో వీటిలో పూడికతీత పనులు చేపట్టేవారు. పదేళ్లుగా ఎస్సారెస్పీ కాలువల నిర్వహణకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదు. కొత్త చట్టంలో పూడికతీత పనులు లేకపోవడంతో రైతులకు నష్టం వాటిల్లనుంది.

**కొత్త కార్డులిస్తేనే ప్రయోజనం**

ఇప్పటివరకు ఏటా 100 పని దినాలుండగా 125 రోజులకు పెంచారు. కాగా వ్యవసాయ సీజన్‌లో పనులు నిలిపేయనుండటంతో ఏడాదికి లక్ష్యం చేరుకోవడం కష్టమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రెండేళ్లుగా కొత్త జాబ్ కార్డుల మంజూరు లేకపోవడంతో కుటుంబాలు విడిపోయినప్పటికీ 100 రోజులే పని కల్పిస్తుండటంతో సరిపోవడం లేదు. పెంచిన పని దినాలతో ఉమ్మడి జిల్లాలోని 4,58,397 మంది క్రియాశీల కూలీలకు ప్రయోజనకరంగా మారినా కొత్త జాబ్‌కార్డులు జారీ చేస్తేనే ప్రయోజనం చేకూరనుంది. వేసవిలో కొలతల్లో సడలింపు, ఫిబ్రవరి నుంచి జూన్ వరకు అదనపు భత్యం చెల్లింపు అమలు చేసేవారు. నాలుగైదేళ్లుగా అమలుకు నోచుకోవడం లేదు. కొత్త చట్టంలోనైనా లోటుపాట్లు సవరిస్తే కూలీకు మేలు చేకూరనుంది.

# ఉపాధి వల.. విదేశాల్లో విలవిల

జగిత్యాల : సామాజిక మాధ్యమాల్లో ఉద్యోగ ప్రకటనలు చూసి నిరుద్యోగులు మోసపోతున్నారు. ఏజెంట్ల మాటలు నమ్మి కటకటాలపాలవుతున్నారు. ఇటీవలి కాలంలో జిల్లాలో వరుస ఘటనలు పరిస్థితికి అద్దం పడుతున్నాయి. జిల్లాకు చెందిన కొందరు అనధికార ఏజెంట్లు యూరప్ దేశాల్లో అధిక వేతనాల ఆశ చూపి యువత నుంచి రూ.5 నుంచి 8 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. అనంతరం సందర్శక వీసాలతో థాయ్‌లాండ్ పంపుతున్నారు. అక్కడికి వెళ్లాక సైబర్ ముఠాలకు అప్పగిస్తున్నారు. ఇటీవల ముగ్గురు యువకులు ఇలాగే మోసపోయారు. మయన్మార్‌లో



చిక్కుకుపోయిన తెలుగు రాష్ట్రాలకు చెందిన 74 మందిని దాదాపు నెల రోజుల కిందట ఆర్మీ సహకారంతో స్వదేశానికి తీసుకొచ్చారు. అందులో జిల్లాకు చెందిన ముగ్గురు బాధితులున్నారు.

ఈ ఏడాది జనవరిలో మయన్మార్, కంబోడియాల్లో సైబర్ స్థావరాలపై దాడులు జరిపిన పోలీసులు సుమారు 530 మందిని పట్టుకున్నారు. అందులో 26 మంది తెలుగు రాష్ట్రాలకు చెందినవారే.

గత మార్చిలో జిల్లాకు చెందిన అయిదుగురు యువకులను సందర్శక వీసాపై థాయ్‌లాండ్ పంపించారు. అక్కడి నుంచి కంబోడియాకు తరలించి సైబర్ నేరాలకు పాల్పడేలా ఒత్తిడి చేయడంతో బాధితులు తప్పించుకొని వచ్చారు. ఈ కేసులో జిల్లాకు చెందిన ఇద్దరు ఏజెంట్లు అరెస్టయ్యారు.

**మూడు దేశాల్లో నేరాలు**

థాయ్‌లాండ్ నుంచి లావోస్, మయన్మార్, కంబోడియా దేశాల్లోని సైబర్ స్థావరాలకు వలసజీవులను పంపిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో పలుమార్లు దాడులు నిర్వహించి బాధితులను విడిపించారు. సైబర్ నేరాలు చేయడానికి ఒప్పుకోకుంటే కఠినంగా శిక్షిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. థాయ్‌లాండ్ వరకు సందర్శక వీసాలపై తీసుకెళ్లి అనధికారికంగా సైబర్ స్థావరాలకు తరలించి ఓ ప్రాంతంలో భారీ బందోబస్తు మధ్య సైబర్ నేరాలు చేయిస్తున్నారని ఇటీవల వచ్చిన బాధితులు తెలిపారు.

**పోలీసుల అవగాహన**

సైబర్ మోసాలపై ఎస్పీ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు కళా బృందాలు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాయి. ప్రభుత్వ టామ్‌కామ్ లేదా గుర్తింపు పొందిన ఏజెన్సీల ద్వారా మాత్రమే విదేశాలకు వెళ్లాలని, అధిక వేతనంపై ఆశతో సైబర్ ముఠాలకు చిక్కొద్దని సూచిస్తున్నాయి.

**లైసెన్సుడ్ ఏజెంట్లనే సంప్రదించాలి**

ఆన్‌లైన్‌లో వచ్చే ఉద్యోగ ప్రకటనలను నమ్మొద్దు. గత వారం ఇలాంటి మోసాన్ని బయటపెట్టి నిందితుడిని అరెస్టు చేశాం. నకిలీ ఏజెంట్లు మాయమాటలతో మోసగిస్తున్నారు. మొదట ఏజెంట్లుగా చెప్పుకొనే వారికి లైసెన్స్ ఉందో? లేదో? తెలుసుకోవాలి. గతంలో ఎంత మందికి ఉద్యోగాలిప్పించారో ఆరా తీయాలి. ఒకటికి రెండు సార్లు పరిశీలించాకే నిర్ణయం తీసుకోవాలి. బాధితులు ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం. రఘుచందర్, జగిత్యాల డీఎస్పీ

# మైజీహెచ్‌ఎంసీ యాప్




హైదరాబాద్ : డివిజన్ల పునర్విభజన పూర్తవడంతో.. శివారు ప్రాంతాలకు పౌర సేవలు చేరువ చేయడంపై జీహెచ్‌ఎంసీ దృష్టిపెట్టింది. అందులో భాగంగా 'మైజీహెచ్‌ఎంసీ' యాప్‌ను ఐటీ విభాగం బలోపేతం చేస్తోంది. శివారు అవసరాలకు తగ్గట్టుగా.. చేర్పులు, మార్పులు చేస్తోంది. ఇప్పటికే ప్రాథమిక సమస్యలపై ఫిర్యాదు చేసేట్లు మార్పులు చేశామని, త్వరలోనే ఆస్తిపన్ను చెల్లింపులు, ఇతర పౌర సేవలన్నింటినీ విస్తరిస్తామని కమిషనర్ ఆర్వీ.కర్ణన్ ధీమా వ్యక్తం చేశారు.

**వివరాల నమోదు..:** ప్రస్తుతం యాప్‌లో పాత జీహెచ్‌ఎంసీలోని 150 డివిజన్ల వివరాలు మాత్రమే స్పష్టంగా ఉన్నాయి. విలీనమైన 27 స్థానిక సంస్థల పేర్లను తాజాగా నమోదు చేశారు. ఆయా పట్టణ స్థానిక సంస్థల పరిధిలోని సమస్యలపై ప్రజలు ఫిర్యాదు చేస్తే.. ఆ సమాచారం నేరుగా మున్సిపల్ కమిషనర్‌కు చేరుతుంది. మున్ముందు.. ఫిర్యాదులను మున్సిపల్ కమిషనర్‌తోపాటు, బాధ్యుడైన అధికారికి చేరేట్లు సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. కొత్త డివిజన్ల హద్దులను జియో ఫెన్సింగ్ చేయాల్సి ఉందని వెల్లడించారు.

**ఈ ఫిర్యాదులు చేయొచ్చు**

ఇంజినీరింగ్(రోడ్లపై గుంతలు, మ్యాన్‌హోళ్ల సమస్యలు ఇతర), ఎలక్ట్రికల్(వీధి దీపాలు, ఇతర), ఫుడ్‌సేఫ్టీ(ఆహార కల్తీ, నాసిరకం వంటకాలు), ఎంటమాలజీ(దోమల సమస్య, చెరువుల్లో గుర్రపుడెక్క), వెటర్నరీ(వీధి కుక్కలు), టౌన్‌ప్లానింగ్(నిర్మాణ అనుమతులతో ముడిపడిన సమస్యలు), అర్బన్‌బయోడైవర్సిటీ(పచ్చదనానికి సంబంధించి), అడ్వర్టైజ్‌మెంట్(హోర్డింగులు, ఫ్లెక్సీలు), ఎస్టేట్స్ (బల్దియా మార్కెట్లు, కాంప్లెక్సుల్లోని దుకాణాలఅన్యాక్రాంతం, ఆక్రమణలు), రెవెన్యూ (రెవెన్యూ, ట్రేడ్ లైసెన్సులు), ఎన్నికలు(ఓటరు దరఖాస్తులు, ఓట్ల తొలగింపు) ఐటీ(యాప్, వెబ్‌సైట్‌లు పనిచేయకపోవడం, ఇతర సాంకేతిక సమస్యలు), పార్కింగ్(రోడ్లపై అక్రమ పార్కింగ్, సెల్లారు దుర్వినియోగం, ఇతర), చెరువులు(చెరువులు, నాలాల ఆక్రమణ, పూడిక సమస్య), పారిశుద్ధ్యం, ఆరోగ్యం(జనన, మరణ ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులు), ట్రేడ్‌లైసెన్స్(వ్యాపార ధ్రువీకరణపత్రం) సేవలు పొందడంలో తలెత్తే సమస్యలపై ఫిర్యాదు చేయొచ్చు. గూగుల్‌ప్లేస్టోర్, ఐఓసీ ప్లేస్టోర్‌లో అందుబాటులో ఉంది.

# పైరవీలు.. ప్రదక్షిణలు




హైదరాబాద్ : హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) ప్రణాళిక విభాగంలోని అధికారులు బల్దియా వైపు చూస్తున్నారు. తాజాగా అవుటర్ రింగ్ రోడ్డు పరిధిలోని దాదాపు 27 మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు బల్దియాలో చేరిన నేపథ్యంలో గతంలో డిప్యూటేషన్‌పై హెచ్‌ఎండీఏకు వచ్చిన వారంతా తిరిగి బల్దియాకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటినుంచే తెలిసిన ఉన్నతాధికారులతో పైరవీలకు యత్నిస్తున్నట్లు తెలుస్తోంది. హెచ్‌ఎండీఏ ప్రణాళిక విభాగంలో ఇద్దరు డైరెక్టర్లతోపాటు, చీఫ్ ప్లానింగ్ అధికారులు, ప్లానింగ్ అధికారులు, సహాయ ప్లానింగ్ అధికారులు కలిపి మొత్తం 31 మంది వరకు పనిచేస్తున్నారు. ఇప్పటివరకు చేతి నిండా పని ఉండటంతో ఉక్కిరిబిక్కిరి అయ్యే పరిస్థితి. హెచ్‌ఎండీఏకు ఆదాయం తీసుకొచ్చే ప్రధాన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు బల్దియా కిందికి వెళ్లడంతో ప్రణాళిక విభాగంపై ఒత్తిడి పూర్తిస్థాయిలో తగ్గనుంది. ప్రస్తుతం ఈ విభాగంలో 31 మంది పనిచేస్తుండగా.. ఇందులో 19 మంది వరకు గతంలో డిప్యూటేషన్‌పై వచ్చినవారే. ఇద్దరు డైరెక్టర్లు కూడా బల్దియా నుంచి వచ్చి హెచ్‌ఎండీఏలో సేవలందిస్తున్నారు.

**ముందే పసిగట్టి:** కొందరైతే ఇప్పటినుంచే పైరవీలు చేసుకుంటున్నట్లు హెచ్‌ఎండీఏలో ప్రచారం జరుగుతోంది. ఇటీవలే హెచ్‌ఎండీఏలో కొత్తగా మరో 3 వేల చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని కలిపారు. భవిష్యత్తులో ఇక్కడ కార్యకలాపాలు పెరగనున్నాయి. ఈ నేపథ్యంలో తిరిగి వీరిని వెనక్కి పంపే అవకాశం లేదంటున్నారు. దీన్ని ముందే పసిగట్టిన కొందరు ఎలాగైనా వెనక్కి వెళ్లిపోవాలని పైరవీలకు తెర తీసినట్లు తెలుస్తోంది.

**చిరునామా మార్చుకునేందుకు సమాయత్తం**

హెచ్‌ఎండీఏ ప్రణాళిక విభాగం మధ్యాహ్నం నుంచి దళారులతో కిటకిటలాడుతుంటుంది. సీపీవోలు, పీవోలు, ఏపీవోలు, డైరెక్టర్ ఛాంబర్ల వద్ద తిష్ఠ వేసి తమ దరఖాస్తు క్లియరెన్సు కోసం నానా తిప్పలు పడుతుంటారు. బిల్డ్ నౌలో దరఖాస్తు చేసుకున్నా సరే.. కొందరు అధికారులను, కిందిస్థాయి ఉద్యోగులను ప్రసన్నం చేసుకోనిదే దరఖాస్తులు ముందుకు కదలని పరిస్థితి. ఓఆర్ఆర్ వరకు నిర్మాణరంగం శరవేగంగా జరుగుతుండటంతో దరఖాస్తులు భారీగానే వస్తున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటికే లేఅవుట్లు, బిల్డింగ్ నిర్మాణ అనుమతుల ద్వారా రూ.700–800 కోట్ల ఆదాయం దాటింది. ఏటా ఇది రూ.1200 కోట్లు దాటుతుంది. హెచ్‌ఎండీఏ ప్రధాన కార్యాలయం ఉన్న స్వర్ణ జయంతి చుట్టూ ఉన్న కన్సల్టెన్సీల్లో ఎక్కువశాతం దళారుల కార్యాలయాలే. ప్రధాన ఆదాయ వనరులుగా ఉన్న శివారు కార్పొరేషన్లు ఇక బల్దియా పరం కావడంతో వీరు సైతం చిరునామాలు మార్చుకునేందుకు సమాయత్తమవుతున్నారు.

# మూడుగా ముత్యాల నగరం!



హైదరాబాద్ : బృహత్ నగరం తాత్కాలికమే. రెండువేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో ఏర్పాటైన విశాల నగరం. త్వరలోనే మూడు భాగాలు కానుంది. గ్రేటర్ హైదరాబాద్ పాలకమండలి గడువు పూర్తయ్యాక.. విభజన ప్రక్రియ మొదలవుతుంది. ఆ విషయాన్ని దృష్టిలో ఉంచుకునే రాష్ట్ర ప్రభుత్వం జోన్లు, సర్కిళ్ల పునర్వ్యవస్థీకరణ చేపట్టింది. మూసీకి దక్షిణం వైపున నాలుగు జోన్లు.. ఉత్తరాన 8 జోన్లు ఏర్పాటు చేసింది.

**నాలుగు జోన్లకో కార్పొరేషన్:** బాహ్య వలయ రహదారి(ఓఆర్ఆర్) వరకు ఉన్న ప్రాంతాలన్నింటినీ కలిపి రాష్ట్ర ప్రభుత్వం టీసీయూఆర్(తెలంగాణ అర్బన్ కోర్ రీజియన్)గా పేర్కొంది. రాజధానిలో పట్టణీకరణ శరవేగంగా జరుగుతున్నందున.. అన్ని ప్రాంతాలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి.. ప్రణాళికాబద్ధమైన అభివృద్ధిని సాధించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారు. మూసీకి దక్షిణాన ఉన్న నాలుగు జోన్ల వరకు జీహెచ్‌ఎంసీని పరిమితం చేసి.. ఉత్తరం వైపున భాగాన్ని రెండు మహానగరపాలక సంస్థలుగా ఏర్పాటు చేసే ఉద్దేశం ఉన్నట్లు సమాచారం. సైబరాబాద్, సికింద్రాబాద్ పేర్లతో ఆయా నగరపాలక సంస్థలను ఏర్పాటుచేయాలని ఇటీవల ముఖ్యమంత్రి వద్ద జరిగిన ఓ సమావేశంలో చర్చ జరగడం గమనార్హం.

**పాలకమండలి గడువు పూర్తయ్యాకే..:** పాలకమండలి గడువు వచ్చే ఫిబ్రవరి 10తో ముగియనుంది. తర్వాత 300 డివిజన్లను మూడు భాగాలుగా చేసే ప్రక్రియ మొదలవుతుంది. మార్చి లేదా ఏప్రిల్‌లో ఎన్నికలు ఉంటాయనే ప్రచారం జరుగుతోంది. జులై నాటికి నిర్వహించకపోతే.. 2027 వరకు జరిగే అవకాశం ఉండదని అధికారులు విశ్లేషిస్తున్నారు. జనగణన పూర్తవుతుందని, కొత్త జనాభా లెక్కల ప్రకారం.. పునర్విభజన చేపట్టి.. ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉందంటున్నారు.

**4 వేల ఫిర్యాదుల తిరస్కరణ**

వంద.. రెండు వందలు కాదు.. ఏకంగా 4 వేలకుపైగా ఫిర్యాదులు బుట్టదాఖలయ్యాయి. డివిజన్లు పెంచండి.. హద్దులు మార్చండంటూ రాజకీయ నేతలు, శివారు ప్రాంత ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను జీహెచ్‌ఎంసీ నిర్మొహమాటంగా తిరస్కరించింది. అందులో 90 శాతం అర్జీలు వేర్వేరు రాజకీయ పార్టీల నేతలవి కావడం గమనార్హం. ముందుగా నిర్ణయించుకున్నట్లుగానే డివిజన్ల పునర్విభజనను పూర్తి చేశారనే విమర్శలొస్తున్నాయి. జనాభా, విస్తీర్ణం దృష్ట్యా సమతూకం పాటించలేదని గగ్గోలు పెడుతున్నారు.

**నిర్ణయం తీసుకున్నారిలా..**

వచ్చిన ఫిర్యాదులు: 5,935

పూర్తిగా పరిగణనలోకి తీసుకున్నవి: 1,127

కొంతమేర పరిగణించినవి: 516

తిరస్కరించినవి: 4,292 (మొత్తం ఫిర్యాదుల్లో 72.31 శాతం)

ప్రతిపాదిత జోన్లు.. డివిజన్లు

హైదరాబాద్

శంషాబాద్ : 17

రాజేంద్రనగర్ : 29

చార్మినార్ : 25

ఎల్బీనగర్ : 24

సైబరాబాద్

శేరిలింగంపల్లి : 26


ఖైరతాబాద్ : 25 గోల్కొండ : 26 కూకట్‌పల్లి : 23 సికింద్రాబాద్

సికింద్రాబాద్ : 28 కుత్బుల్లాపూర్ : 27

మల్కాజిగిరి : 26 ఉప్పల్ : 24

# తేట తెలుగు.. డిజిటలీకరణ వెలుగు

ధర్మపురి : తెలుగు పాఠ్యాంశాలను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా డిజిటల్ విధానంలో రూపొందించి స్ఫూర్తినింపుతున్నారు ధర్మపురికి చెందిన భాషోపాధ్యాయుడు డా.గొల్లపల్లి గణేశ్. ఉన్నత పాఠశాలల్లో డిజిటల్ బోధన కోసం ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ ఫ్లాట్ ప్యానెల్ టీవీలు అందించింది. అందుబాటులో వనరులు లేక చాలా చోట్ల ఇవి నిరుపయోగంగా మారాయి. ఈ సమస్యను అధిగమించడానికి గణేశ్ ఫ్లాట్ ప్యానెల్‌లో బోధనకు అనుకూలంగా 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు పాఠ్యాంశాలను అందమైన బొమ్మలతో, పట్టికల చిత్రాలతో రూపొందించారు. కృత్రిమ మేధ(ఏఐ) సాయంతో సాంకేతిక ఉపకరణాలను వినియోగించారు. బొమ్మలకు తగ్గట్టుగా ఆకర్షణీయమైన గొంతులు జత కలవడంతో పిల్లలకు సులభంగా



అర్థమవుతోంది. తెలుగు భాషపై ఆసక్తి పెరిగింది. గణేశ్ రూపొందించిన బోధనాభ్యసన సామగ్రిని రాష్ట్రంలోని పలువురు భాషా ఉపాధ్యాయులతో పాటు తెలుగు ఐచ్ఛికంగా పరీక్షలు రాసే ఉద్యోగార్థులు వినియోగిస్తున్నారు. దాదాపు నెల రోజుల కిందట ఎస్ఈఆర్‌టీ రాష్ట్ర పరిశీలకులు సులోచన, డీఈవో రామునాయక్‌లు ధర్మపురికి వచ్చినపుడు గణేశ్ బోధనా విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి ప్రశంసించారు. పాఠ్యాంశాల్లో పదో తరగతి ఉపవాచకానికి సంబంధించి రామాయణాన్ని చిత్రాలతో రూపొందించడం తెలుగు రాష్ట్రాల్లోని పలువురిని ఆకర్షించింది. పాఠ్యాంశాలే కాకుండా వ్యాకరణానికి సంబంధించిన సంధులు, సమాసాలు, అలంకారాలు, ఛందస్సు, వాక్యాలు ఇందులో ఉన్నాయి. గతంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి అంతర్జాలంలో తెలుగు భాషా సాహిత్యాలపై పరిశోధన(పీహెచ్‌డీ) చేసి పట్టా పొందిన గణేశ్ ఈ ఏడాది రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు.

# కష్టాలకు ఎదురీది.. బాధ్యతలు గుర్తెరిగి

రాజపేట : బేగంపేటకు చెందిన సరితను యాదగిరిగుట్ట మండలం బాహుపేట పంజాల భాస్కర్‌కు ఇచ్చి గత 20 ఏళ్ల క్రితం వివాహం జరిపించారు. ఇద్దరు అమ్మాయిలు, ఓ కుమారుడు జన్మించిన తదుపరి భర్త సైకిల్‌పై వెళ్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదంలో మరణించాడు. చిన్నప్పటి నుంచి గారాబంగా పెరిగిన సరితకు ఒక్కసారిగా ముగ్గురు పిల్లల సంరక్షణతో పాటు కుటుంబ బాధ్యతలు మీద పడ్డాయి. పదో తరగతి చదువుకున్నప్పటికీ చేసేదేమీ లేక వ్యవసాయ కూలీగా, స్థానికంగా ఉపాధిహామీ పనికి వెళ్లి కుటుంబాన్ని నెట్టుకొస్తుంది. కూలీ పనులు చేపడితే సంసారం గడవడం కష్టంగా ఉందని భావించిన సరిత కూరగాయల వ్యాపారానికి పూనుకుంది. ఆటో అద్దెకు తీసుకుని యాదగిరిగుట్ట, ఆలేరు, రాజపేట మండలాల్లోని



వార సంతలో కూరగాయలు విక్రయిస్తూ ఉపాధి పొందింది. ఆటో అద్దె రోజుకు రూ.వెయ్యి చెల్లిస్తుండటంతో వచ్చిన లాభం ఆటోకే వెళుతోంది. మిగులు లేదని భావించిన సరిత స్థానికంగా మహిళా సంఘంలో రుణం తీసుకుని తానే ఆటో కొనుగోలు చేసింది. సోదరుడు ఉపేంద్ర సాయంతో డ్రైవింగ్‌లో తర్ఫీదు పొందుతున్న క్రమంలో గాయాలపాలైంది. గాయాలను లెక్కచేయకుండా డ్రైవింగ్ నేర్చుకుని నాలుగేళ్లుగా ఆటో నడుపుకొంటూ తండ్రి సత్తయ్య సహకారంతో కూరగాయల వ్యాపారం చేపడుతోంది.

పెద్ద అమ్మాయి ఐశ్వర్య డిగ్రీ పూర్తిచేసి పోటీ పరీక్షలకు సిద్ధమవుతోంది. చిన్నమ్మాయి మనీష డిగ్రీ ద్వితీయ, బాబు నాగరాజు ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. పిల్లలను ఉన్నత స్థాయికి చేర్చడమే తన లక్ష్యమని చెబుతోంది సరిత.

# యువత చేతికి పల్లె పగ్గాలు!

ఖమ్మం : గ్రామ పంచాయతీ పాలనా పగ్గాలు యువత చేతికి చిక్కాయి. ఇటీవల ముగిసిన ఎన్నికల్లో సర్పంచులుగా గెలుపొందిన వారిలో ఎక్కువ మంది యువతీయువకులే ఉన్నారు. జిల్లాలో 31 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు వారు 389 మంది సర్పంచులుగా ఎన్నికవటం విశేషం. మొత్తం 566 గ్రామ పంచాయతీ సర్పంచి స్థానాలకు ఎన్నికలు నిర్వహించగా 565 పంచాయతీల్లో సర్పంచులు ఎన్నికయ్యారు. ఏన్కూరు మండలం నూకాలంపాడు పంచాయతీలో సర్పంచి స్థానానికి ఎవరూ నామపత్రాలు దాఖలు చేయనందున ఎన్నిక జరగలేదు. నామపత్రాల్లో దాఖలు చేసిన వివరాల మేరకు గెలుపొందిన సర్పంచుల వయసులు విభజించగా ఎక్కువ మంది యువతే ఉన్నారు. యువత చేతికి పాలనా పగ్గాలు దక్కటంతో పల్లెప్రజలకు సత్వర సేవలు అందుతాయని, అభివృద్ధి వేగవంతమవుతుందని పలువురు ఆశిస్తున్నారు. సర్పంచుల్లో ఎక్కువ మంది విద్యాధికులు కావటం గమనార్హం. పదోతరగతి నుంచి డిగ్రీ, పోస్టుగ్రాడ్యుయేట్ వరకు చదువుకున్నవారు సర్పంచులుగా ఎన్నికయ్యారు. కొందరు నిరక్షరాస్యులూ ఉన్నారు. గూడె పుష్పావతి 34ఏళ్ల వయసులో కొణిజర్ల సర్పంచిగా ఎన్నికయ్యారు. బీఫార్మసీ చదివి హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ కంపెనీలో ఉద్యోగం చేసేవారు. ఉద్యోగానికి రాజీనామా చేసి ఎన్నికల్లో పోటీచేశారు. జిల్లాలో అత్యధికంగా 1,446 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. జవ్వాజి అశ్విని 31ఏళ్ల వయసులో వైరా మండలం తాటిపుడి సర్పంచిగా ఎన్నికయ్యారు. ఆమె ఎంఫిల్ విద్యార్హత కలిగి ఉన్నారు. మహిళలకు 50శాతం స్థానాలు రిజర్వ్ కాగా అంతకుమించి అతివలు సర్పంచులుగా ఎన్నికయ్యారు. 31 నుంచి 50 ఏళ్ల మధ్య వయసులో కూసుమంచి మండలంలో 34 మంది, సింగరేణి మండలంలో 32 మంది, తిరుమలాయపాలెం మండలంలో 30 మంది సర్పంచులుగా గెలుపొందారు.

## నీటి'బొట్టు'... జల'సిరి'కి పట్టు

నేరేడుచర్ల : బొట్టు బొట్టుగా వచ్చే నీటిని ఒడిసి పట్టి భూమిలోకి ఇంకేలా చేస్తే తాగు, సాగునీటి ఇక్కట్లు చాలావరకు తీరతాయి. వర్షాకాలంలో చాలా వరకు భూగర్భ జలం ఆశాజనకంగానే ఉంటున్నా.. ఆ తరువాత అడుగంటి ఇక్కట్లు తప్పడం లేదు. జిల్లాలోని 23 మండలాల్లో ఒక్కో గ్రామాన్ని ప్రయోగాత్మకంగా ఎంపిక చేసి జలసంరక్షణ, పారిశుద్ధ్య సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఐదురకాల ఇంకుడు గుంతల నిర్మాణ పనులు చేపట్టారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం నిధులతో ఈ పనులు చేపడుతున్నారు. ఇళ్లలో వ్యక్తిగత, పాఠశాలల్లో సామాజిక ఇంకుడు గుంతలు, ప్రభుత్వ కార్యాలయాల్లో బోర్‌వెల్ రీఛార్జి, భవనాలపై నుంచి వచ్చే వాననీటి సంరక్షణ చర్యలు, గ్రామాల్లో మురుగు నీటిని సురక్షితంగా భూమిలో



ఇంకించేలా నిర్మాణాలు చేపట్టారు.

**నిధుల కేటాయింపు ఇలా...**

వ్యక్తిగత ఇంకుడు గుంతలకు రూ.6,500, సామాజిక రూ.14,073, బోర్‌వెల్ రీఛార్జి రూ.36,000, రూఫ్‌టాప్‌రెయిన్ వాటర్ సంరక్షణ రూ.39,000, డ్రైయిన్ చివర ఇంకుడు గుంతకు రూ.94,000 చెల్లించనున్నారు.

**చురుగ్గా సాగుతున్నాయి..**

డి.సోమసుందర్‌రెడ్డి, ఎంపీడీవో, నేరేడుచర్ల

వివిధ ఇంకుడు గుంతల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. వీటి నిర్మాణం వల్ల భూగర్భజలాలు పెరుగుతాయి. మురుగు నీరు భూమిలో ఇంకడం వల్ల గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు చాలావరకు తొలగే అవకాశం ఉంది.

## ఉపాధి.. కొక్కొరోకో

రాజపేట: మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా సాగాలనే సంకల్పంతో ప్రభుత్వం అనేక రకాలుగా ప్రోత్సహిస్తోంది. వారుచేసే పనితో పాటు అదనపు ఆదాయం సమకూర్చుకోవాలని భావిస్తోంది. మహిళా స్వయం సహాయక సంఘం సభ్యుల అభ్యున్నతికి పథకాలు అమలు చేస్తోంది. పెరటికోళ్ల పెంపకం ప్రోత్సహిస్తోంది. తాజాగా జిల్లాలో ఒక్కో గ్రామైక్య సంఘంలో ముగ్గురు సభ్యులకు రూ.2 వేల రుణం కింద కోడి పిల్లల పంపిణీ కార్యక్రమం త్వరలో ప్రారంభించనుంది. ఒక్కొక్కరికి ఒక యూనిట్ కింద 20 కోడి పిల్లలు అందించనున్నారు. వీరు ప్రతి నెలా రూ.200 వాయిదా చెల్లించాల్సి ఉంటుంది. వివరాలు క్లుప్తంగా..

**ప్రస్తుతం సభ్యుల గుర్తింపు ప్రక్రియ** కోళ్ల పెంపకందారులు గుడ్లతో కోడి పిల్లల పునరుత్పత్తి చేస్తే వారి నుంచి కోడి పిల్లలను కొనుగోలు చేసి ఇతర సభ్యులకు పంపిణీ చేసే అవకాశం ఉండనుంది. గతంలో జిల్లాలో కొన్ని మదర్ యూనిట్లు ఏర్పాటైనట్లుగా తెలుస్తోంది. నిరంతరం ఆదాయ వనరుగా మారే అవకాశం ఉండనుంది. ప్రస్తుతం జిల్లాలోని ఒక్కో గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో మూడు యూనిట్లు అందించే యోచనలో అధికారులు నిమగ్నమై ఉన్నట్లుగా సమాచారం. అయితే ప్రస్తుతం గుర్తింపు ప్రక్రియ జరుగుతున్నట్లుగా డీపీఎం సీహెచ్.రవీందర్ 'న్యూస్‌టుడే'తో వెల్లడించారు.

**యూనిట్లు మంజూరు ఇలా..**

భువనగిరి, ఆలేరు, బొమ్మలరామారం,చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, భూదాన్ పోచంపల్లి, రాజపేట మండలాలకు 150 యూనిట్ల చొప్పున, అడ్డగూడూరు, ఆత్మకూర్(ఎం), బీబీనగర్, తుర్కపల్లి , మోటకొండూరు, రామన్నపేట, వలిగొండ మండలాలకు వంద, యాదగిరిగుట్ట, గుండాల 50 యూనిట్లు మంజూరయ్యాయి.

**పంపిణీ వివరాలు..**

ప్రస్తుతం మంజూరైనవి: 1850

ఒక్కో యూనిట్‌లో కోడిపిల్లలు : 20

యూనిట్‌కు అందించే రుణం: రూ.2వేలు

చెల్లించాల్సిన నెలవారీ కిస్తు : రూ.200

**అదనపు ఆదాయ వనరుగా..**

నాగిరెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

మహిళల ఆదాయ అభివృద్ధికి దేశీయ కోడి పిల్లల పెంపకం దోహదపడుతుంది. ముఖ్యంగా పెరటికోళ్లతో పాటు పెరటి తోటలు, కూరగాయల సాగు, పాడి పరిశ్రమ వంటి యూనిట్లను మహిళా సభ్యులు సద్వినియోగం చేసుకోవాలి.

## రెండుచోట్ల తాగునీరు కలుషితం..

ఖమ్మం : జిల్లా వ్యాప్తంగా అధిక వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగి, నీటి వనరులన్నీ పూర్తిగా నిండాయి. రహదారుల పక్కన వరద నీరు నిలుస్తోంది. ఈ క్రమంలో కొన్ని గ్రామాల్లో తాగునీరు కలుషితం అవుతోంది. గ్రామీణ తాగునీటి సరఫరా(ఆర్‌డబ్ల్యూఎస్) అధికారులు ఖమ్మం, మధిర, సత్తుపల్లి తాగునీటి ప్రయోగశాలల్లో నీటి నమూనాలు పరీక్షించి ఫలితాలు తెలుసుకుంటున్నారు.

2025 జూన్ నుంచి సెప్టెంబరు 16 వరకు 2,729 తాగునీటి నమూనాలు పరీక్షించారు. 88 నమూనాల్లో అధిక మోతాదులో రసాయన పదార్థాలు గుర్తించారు. మరో 556 నమూనాలు సేకరించి బ్యాక్టీరియలాజికల్ పరీ క్షలు జరపగా ఎనిమిది నమూనాల్లో పాజిటివ్ ఉన్నట్లు తేల్చారు.

**సమస్య ఎక్కడ?**

ఖమ్మం రూరల్ మండలం కస్నాతండా, ఆరెకోడు గ్రామ పంచాయతీల పరిధిలోని బోర్లు, బావులు, ట్యాంకుల నుంచి ఈనెల 5, 6 తేదీల్లో సేకరించిన నీటి నమూనాల్లో బ్యాక్టీరియా, అధిక రసాయన పదార్థాలున్నట్టు తేలింది. వీటిని ప్రజలు తాగొద్దని పంచాయతీ కార్యదర్శులకు లేఖ ద్వారా తెలిపారు. వారం రోజులుగా బావులు, ట్యాంకులు శుభ్రం చేయిస్తున్నారు. కస్నాతండాలోని బావిలో నీటిని తోడేసి క్లోరినేషన్ చేయించారు. బోర్లు, ట్యాంకు లను శుభ్రపరుస్తున్నారు. జిల్లాలోని మూడు ప్రయోగశాలల్లో నిరంతరం తాగునీటి పరీక్షలు చేస్తున్నాం. ఎక్కడైనా తేడా ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే క్లోరినేషన్ చేయిస్తున్నాం. భగీరథ పైపులైన్ల ద్వారా శుద్ధి చేసిన నీరు సరఫరా అవుతున్నా కొన్నిచోట్ల పరీక్షిస్తున్నాం. పుష్పలత, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, ఖమ్మం

# బడిలో ఐఐటీ పాఠాలు!



కరీంనగర్ : పాఠశాల దశలోనే అధునాతన సాంకేతిక కోర్సుల పట్ల అవగాహన పెంచుకోవడానికి మద్రాస్ ఐఐటీ స్వల్పకాలిక కోర్సులు ఉపయోగపడుతున్నాయి.. 'స్కూల్ కనెక్ట్' పేరిట ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇస్తుండగా పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులు సాంకేతిక కోర్సులకు సంబంధించి ప్రాథమిక అంశాలపై అవగాహన పెంచుకుంటున్నారు.

**ఉమ్మడి జిల్లాలో 71 విద్యాసంస్థలు..**

ఉమ్మడి జిల్లాలో మొత్తం 71 ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లోని విద్యార్థులు మద్రాస్ ఐఐటీ వారి వివిధ కోర్సులను అభ్యసిస్తున్నారు. డేటా సైన్స్‌-ఏఐ, ఎలక్ట్రానిక్స్ సిస్టమ్స్, ఆర్కిటెక్చర్ - డిజైన్, గణితం - కంప్యూటింగ్, గణితం - గేమ్-పజిల్స్, పర్యావరణ శాస్త్రం, బయో ఇంజినీరింగ్- బయోలాజికల్ సైన్స్, ఇంట్రడక్షన్ టూ లా, వైమానిక శాస్త్రం ప్రాథమికాంశాలు, మానవ శాస్త్రాల పరిచయం అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభంలో రిజిస్ట్రేషన్లు చేసుకున్న పాఠశాలలు, కళాశాలలకు ఈ అవకాశాన్ని కల్పిస్తున్నారు. ఎంపికైన విద్యా సంస్థకు ఐఐటీ వారు అందించే యునిక్ ఐడీ ద్వారా విద్యార్థులు వివిధ కోర్సుల్లో శిక్షణ కోసం రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారు. ఒక్కో కోర్సుకు 2 నెలల పాటు ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తుండగా, విద్యార్థులు వ్యక్తిగత ఐడీ ద్వారా కోర్సులకు సంబంధించిన విద్యా విషయాలు, వీడియోలను పొందుతారు. ప్రతి 15 రోజులకోసారి వీకెండ్ పరీక్షలు, తుదకు ఫైనల్ పరీక్ష ఉంటుంది. ఇందులో అర్హత సాధించిన వారికి ధ్రువపత్రాలు ఇస్తున్నారు.፡ విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే ప్రతి గూగుల్ మీట్ ద్వారా ఐఐటీ ఆచార్యులు నివృత్తి చేస్తారు.

**ఈ కోర్సులతో ప్రయోజనం ఇలా..**

డిజిటల్ నైపుణ్యాలు, లాజికల్ థింకింగ్ పెరుగుతుంది.

ఉన్నత విద్యావకాశాలపై అవగాహన కలుగుతోంది.

ఆధునిక సాంకేతికతపై పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు పట్టు సాధిస్తున్నారు. తీరిక సమయంలో ఆన్‌లైన్ ద్వారా ఇంటి వద్దే తరగతులు వినే, చూసే వెసులుబాటు ఉండటంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఆసక్తి ప్రదర్శిస్తున్నారు.

కృత్రిమ మేధపై ఆసక్తి పెరిగింది

డేటా సైన్స్- ఏఐ 8 వారాల కోర్సు పూర్తి చేసి మెరిట్ సర్టిఫికెట్ పొందా. కొత్త విషయాలు తెలుసుకోవడమే కాదు చిన్న ప్రోగ్రామ్స్ చేయడం నేర్చుకున్నా. కృత్రిమ మేధ భవిష్యత్తులో ఏరకంగా ఉపయోగపడుతుందనే దానిపై అవగాహన పెరిగింది.

పి.సహస్ర, జడ్పీ ఉన్నత పాఠశాల, ఇల్లంతకుంట

మార్పులపై అవగాహన

డేటా సైన్స్- ఏఐ కోర్సులో చేరడం ద్వారా చాలా అంశాలు నేర్చుకున్నా. సాంకేతిక పరిజ్ఞానంలో వచ్చే మార్పులపై అవగాహన కలిగింది. ఇంజినీరింగ్ కోర్సుల్లోని పలు అంశాలను ఇప్పుడే నేర్చుకునే అవకాశం దీని ద్వారా పొందా. కె.దిలీప్‌కుమార్, జడ్పీ ఉన్నత పాఠశాల, గట్టుబూత్కూర్

# బాల్యానికి భరోసా.. మనందరి బాధ్యత



పెద్దపల్లి : తల్లి పొత్తిళ్లలోనే కనుపాపలు మూసుకుంటున్నాయి. లోకం చూడకుండానే మృత్యు కౌగిలి ముద్దాడుతోంది. మాతృత్వపు మధురిమల రుచి చూడకుండానే కానరాని లోకాలకు చేరుకుంటున్నారు. ఏటికేటా పెరుగుతున్న నవజాతి శిశు మరణాలు తగ్గించేందుకు వైద్యారోగ్య శాఖ 'సంకల్ప్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా ఆదిలాబాద్ జిల్లాలో అమలు చేయగా సత్ఫలితం రావడంతో మిగిలిన జిల్లాల్లో ప్రవేశపెట్టారు. దీని కోసం ఆసుపత్రుల్లో ప్రత్యేక నవజాతి శిశు కేంద్రాలను ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు.

**నిరంతర పర్యవేక్షణ**

జిల్లాలో నవజాతి శిశువు మరణాలు తగ్గించేందుకు పెద్దపల్లి, గోదావరిఖని సార్వజనిక ఆసుపత్రుల్లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు. నిరంతరం పిల్లల వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నారు. ఎలాంటి లక్షణాలు ఉన్నాయో తరచూ పరీక్షిస్తున్నారు. సంపూర్ణ ఆరోగ్యంగా తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. పుట్టిన వెంటనే పాలు పట్టించడం, తల్లి, తండ్రి ఒడిలోనే పాపను ఒదిగేలా చేస్తున్నారు. శిశువుల ఆరోగ్యాన్ని సాధారణ స్థితిలోకి తీసుకొస్తున్నారు. రెండేళ్ల గణంకాలు పరిశీలిస్తే కాస్త తగ్గుముఖం పట్టాయి.

**వివరాల సేకరణ**

జిల్లాలో నవజాతి, శిశు మరణాల సంఖ్య తేల్చేందుకు వివరాలు సేకరిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఏడాదిలో ఎన్ని మరణాలు నమోదయ్యాయి? వాటికి గల కారణాలు తెలుసుకుంటున్నారు. గ్రామాల్లో గర్భం దాల్చిన ప్రతి ఒక్కరికి ఏఎన్‌మ్‌లు, ఆశా కార్యకర్తలతో గర్భిణులు, బాలింతలకు చైతన్యం కల్పించనున్నారు. పౌష్టికాహారం తీసుకునేందుకు ప్రోత్సహించనున్నారు. ఏ ప్రాంతాల్లో అధికంగా మరణాలు ఉంటే వాటిపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు.

రెండేళ్లలో నవజాత శిశు మరణాలు

| | |
|---|---|
| 2024-25 | 40 |
| 2025-26 | 13 |

శిశు మరణాలకు కారణాలివే..

నెలలు నిండకముందే ప్రసవం

తల్లి గర్భ సంచి వదులుగా ఉండటం

రక్తహీనత, శరీర బలహీనత

పాప బరువు తక్కువగా, శ్వాసకోశ సమస్యలు ఉండటం

తల్లికి ఇన్‌ఫెక్షన్లు ఉండటం

# వడివడిగా భూసేకరణ ప్రక్రియ

కోరుట్ల : ఎల్లంపల్లి ఎత్తిపోతల ప్యాకేజీ-2లోని కలికోట సూరమ్మ జలాశయ కాలువల నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కథలాపూర్, బీమారం, మేడిపల్లి, రుద్రంగి మండలాల్లోని దాదాపు 40 వేల ఎకరాలకు సాగు నీరందించే లక్ష్యంతో కథలాపూర్ మండలం కలికోట వద్ద 0.45 టీఎంసీల సామర్థ్యంతో జలాశయం నిర్మించారు. రూ.173.26 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టులో ఇప్పటికే మత్తడి నిర్మాణం పూర్తి కాగా కట్ట, రివిట్‌మెంట్ తదితర పనులు కొనసాగుతున్నాయి. ప్రధాన కాలువలు, డిస్ట్రిబ్యూటరీలకు భూ సేకరణ కోసం నిధులు విడుదలయ్యాయి. అధికారులు రెండు గ్రామాల్లో సభలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యాక పరిహారం చెల్లింపు పూర్తి కానుంది.

**13 గ్రామాలు.. 520 ఎకరాలు**

జలాశయం కుడి, ఎడమ కాలువలను కథలాపూర్, బీమారం, మేడిపల్లి మండలాల్లోని 13 గ్రామాల మీదుగా నిర్మించనున్నారు. 19.40 కిలోమీటర్ల మేర మొత్తం 520.19 ఎకరాల భూమిని సేకరించనుండగా సర్వే ద్వారా హద్దులు నిర్ణయించారు.

ఎడమ కాలువ కింద కలికోటలో 48.31 ఎకరాలు, పోతారం 24.17, ఇప్పపల్లి 39.11, తాండ్రియాల 40,13 ఎకరాలు, పోసానిపేట 20.17, దుంపేట 27.32, చింతకుంట 24.33 ఎకరాలు కలిపి మొత్తం 225.34 ఎకరాలు ముంపునకు గురి కానుంది.

కుడి కాలువ కింద తాండ్రియాల 2.09 ఎకరాలు, అంబారిపేట 73.03, గంభీర్‌పూర్ 50.05, గోవిందారం 104.09, బీమారం 22.18, మన్నేగూడెం 37.14, దమ్మన్నపేట 5.06 ఎకరాలు, 294.25 ఎకరాల భూమిని సేకరిస్తున్నారు.

**పది రోజుల్లో పరిహారం**

కుడి, ఎడమ కాలువల భూసేకరణ కోసం రూ.80 కోట్లు అవసరం. ఇందులో భాగంగా ఏడాది కిందట ప్రభుత్వం రూ.10 కోట్లను విడుదల



చేసింది. ఇటీవల మరోమారు రూ.34.50 కోట్లు రాగా మొత్తం రూ.45 కోట్లు కలెక్టర్ ఖాతాలో ఉన్నాయి. భూ సేకరణ కింద కలికోటలో ఎకరానికి రూ.9,40,310, పోతారంలో రూ.8,60,597 చొప్పున పరిహారం నిర్ణయించారు. మరో పది రోజుల్లో రైతుల ఖాతాల్లో పరిహారం జమ కానుంది. ఇప్పపల్లిలో శనివారం గ్రామసభ నిర్వహించగా తాండ్రియాల, పోసానిపేటల్లో ఈ నెల 16, దుంపేట, చింతకుంట గ్రామాల్లో 19న రైతులతో అధికారులు సమావేశమై అవార్డు పాస్ చేయనున్నారు. ఆ తర్వాత రైతుల ఖాతాల్లో పరిహారం జమ చేయనున్నారు.

**నెలాఖరు నాటికి పనులు ప్రారంభం**

కాలువలకు భూసేకరణ కోసం ఇప్పటికే గ్రామాల్లో పరిహారం ధర నిర్ణయించి అవార్డు పాస్ చేస్తున్నారు. భూమి కోల్పోయిన రైతుల ఖాతాల్లో త్వరలోనే నగదు జమ కానుంది. రెండు, మూడు వారాల్లో మొత్తం 13 గ్రామాల్లో భూ సేకరణ పూర్తవుతుంది. ఈ నెల చివరి వరకు కాలువల నిర్మాణ పనులు ప్రారంభించే అవకాశముంది. జీవాకర్‌రెడ్డి, కోరుట్ల ఆర్డీవో

## కళాశాలను బతికిస్తున్నారు

మల్యాల: మల్యాల మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాలుగేళ్ల కిందట విద్యార్థుల సంఖ్య 150. ఇందులో తరగతులకు హాజరయ్యేది మాత్రం 50 మందే. ప్రస్తుతం మొదటి సంవత్సరంలో 105 మంది, రెండో సంవత్సరంలో 115 మంది చదువుతున్నారు. ఈ మార్పు వెనక అధ్యాపకులు, ప్రిన్సిపల్ సమష్టి కృషి ఉంది. విద్యార్థుల సంఖ్య తగ్గకుండా, వారు నిత్యం కళాశాలకు హాజరయ్యేలా చూడటంతో పాటు నాణ్యమైన బోధన ఇందుకు దోహదపడింది.

**ఆకలి తీరుస్తూ.. అండగా నిలుస్తూ**

దృశ్య, శ్రవణ విధానంలో బోధిస్తే చాలా కాలం గుర్తుండిపోతుందన్న ఆలోచనతో ప్రిన్సిపల్ శివరామకృష్ణ సొంత డబ్బుతో ప్రొజెక్టర్‌ను కొనుగోలు చేశారు. యానిమేషన్ వీడియోలతో పాఠాలు బోధిస్తున్నారు. ఒక్కో అధ్యాపకుడు 15-20 మంది విద్యార్థులను దత్తత తీసుకొని ప్రతి రోజూ కళాశాలకు హాజరయ్యేలా చూస్తున్నారు. విద్యార్థుల గైర్హాజరు, చదువులో పురోగతిపై ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు సమాచారం అందిస్తుంటారు.

తల్లిదండ్రులు లేని, పేద విద్యార్థుల చదువుకు మలబార్ గోల్డ్ సంస్థ అందించే ఆర్థిక సాయం కోసం అధ్యాపకులే స్వయంగా దరఖాస్తు చేస్తున్నారు. కళాశాల నుంచి రెండేళ్ల కిందట 42 మంది, గతేడాది



28 మంది విద్యార్థులు రూ.8 వేల నుంచి రూ.10 వేల ఆర్థిక సాయం పొందారు. ఈ సంవత్సరం 32 మంది దరఖాస్తు చేశారు.

వార్షిక పరీక్షల సమయంలో దాతల సాయంతో కళాశాలలో మధ్యాహ్నం భోజనం అందిస్తున్నారు.

దూర ప్రాంతాల నుంచి వచ్చే పేద విద్యార్థుల రవాణా ఖర్చులను అధ్యాపకులే సమకూరుస్తున్నారు.

విద్యార్థులకు కిచిడీ అందించడానికి ముడి సామగ్రి సమకూర్చడానికి సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు ముందుకొచ్చారు.

పేరెంట్ టీచర్ సమావేశానికి అధ్యాపకులు స్వయంగా విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులను ఆహ్వానిస్తున్నారు.

పాఠాలు గుర్తుండిపోతున్నాయి

ప్రొజెక్టర్ సాయంతో యానిమేషన్ వీడియోల ద్వారా బోధించే పాఠాలు గుర్తుండిపోతున్నాయి. అధ్యాపకులు వివిధ రకాల బోధనా సామగ్రిని మాతోనే తయారు చేయించడంతో సబ్జెక్టుపై మరింత అవగాహన పెరుగుతోంది. అధ్యాపకుల ఆర్థిక సాయంతో బల్వంతాపూర్ నుంచి 6 కిలోమీటర్ల దూరంలోని కళాశాలకు వస్తున్నా.

గంగాభవాని, బైపీసీ రెండో సంవత్సరం

విద్యార్థుల హాజరుపై ప్రత్యేక శ్రద్ధ

ఒక్కో అధ్యాపకుడు 15 నుంచి 20 మంది చొప్పున దత్తత తీసుకున్నాం. గైర్హాజరయ్యే విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేస్తాం. కళాశాల జనావాసాలకు దూరంగా ఉండటంతో మధ్యాహ్న భోజనానికి ఇళ్లకు వెళ్తుంటే సమయం వృథా అవుతోంది. సత్యసాయి సేవాట్రస్టు నిర్వాహకులు కిచిడీ అందించడానికి ముందుకొచ్చారు. ఇటీవల మంజూరైన రూ.16 లక్షలతో అవసరమైన వసతులు కల్పిస్తాం.

శివరామకృష్ణ, ప్రిన్సిపల్

## ఆటలకు చోటేది.. పోటీలకు నిధులేవి?

జగిత్యాల : 'క్రీడల అభివృద్ధే లక్ష్యం, క్రీడలతోనే ఆరోగ్యం' ఇవన్నీ వివిధ వేదికలపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చెప్పే మాటలు. కానీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే మైదానాలు, క్రీడా సామగ్రి అంతంతే. నిధుల కేటాయింపు అలసత్వంతో ఆటలకంటూ ఓ పీరియడ్ ఉంటుందనే విషయాన్ని విద్యార్థులు మరచిపోతున్నారు. దీంతో విద్యార్థుల్లో శారీరక, మానసిక ఆరోగ్యం ఆశించిన స్థాయిలో ఉండటం లేదు. చాలామందికి క్రీడల్లో ప్రవేశం లేకుండానే విద్యార్థి దశ ముగు స్తోంది. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచేందుకు అవకాశం కల్పించే ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని క్రీడాకారులు అభ్యర్థిస్తున్నారు.

**బాలబాలికల విభాగాల్లో..**

ఉమ్మడి జిల్లాలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్బాల్, హ్యాండ్‌బాల్, నెట్బాల్, సాఫ్ట్‌బాల్, యోగా, క్రికెట్, అథ్లెటిక్స్ తదితర పోటీలపై ఆసక్తి ఉంది. దీంతో 14 ఏళ్లు, 17 ఏళ్లలోపు బాల, బాలికలకు పోటీలు నిర్వహిస్తున్నారు. ఇటీవల జగిత్యాల జిల్లాలో కథలాపూర్, మెట్పల్లిలో ఖోఖో.. లక్ష్మీపూర్‌లో బాస్కెట్బాల్ పోటీలు, రాజన్న సిరిసిల్ల జిల్లాలో కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించగా.. ఆసక్తి, ప్రాధాన్యత, ప్రాచుర్యం తదితర పరిస్థితులకనుగుణంగా మండలాలను గుర్తించి ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నారు. మిగిలిన చదరంగం, టెండికాయిట్, బ్యాడ్మింటన్, ఈత



తదితర క్రీడలకు పెద్దగా పోటీ లేకపోవడంతో ఎంపికలతోనే సరిపెడుతున్నారు. మొత్తం 50 వరకు క్రీడాంశాలుండగా.. ఉమ్మడి జిల్లాలో పోటీలు, ఎంపికలు చేపట్టే క్రీడల సంఖ్యను వేళ్ల మీద లెక్కపెట్టే పరిస్థితులుండటం గమనార్హం.

**దాతలు ముందుకొస్తేనే నిర్వహణ**

జిల్లా స్థాయి పోటీలకు ప్రభుత్వం నుంచి ఎంతోకొంత నిధులు మంజూరవుతుండగా,.. ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు పైసా లేకుండా పోతుంది. వీటి నిర్వహణకు రూ.వేలల్లో నిధులు వెచ్చించాల్సి రావడంతో దాతలపై ఆధారపడటం తప్పనిసరిగా మారింది.

ఇటీవల కథలాపూర్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి 14, 17 ఏళ్లలోపు విభాగంలో బాల, బాలికలకు ఖోఖో పోటీలు నిర్వహిస్తే ఒక్కో విభాగంలో నాలుగు జిల్లాల నుంచి 16 జట్లు పాల్గొన్నాయి. 192 మంది క్రీడాకారులు, న్యాయ నిర్ణేతలు, పీడీలు, పీఈటీలు, నిర్వాహకులు కలిపి మొత్తం 250 మందికి భోజనం ఖర్చు రూ.20 వేలు అయింది. సమ దుస్తులు ఒక్కో దానికి రూ.300 చొప్పున రూ.60 వేలు, బహుమతులకు మరో రూ.5 వేలు, నిర్వహణ కోసం టెంట్లు, మైక్, తాగునీరు తదితరాలకు రూ.10 వేలు కలిపి సుమారు రూ.లక్ష వరకు వెచ్చించాల్సి వస్తోంది.




## శ్రీవారి ఆలయంలో ముక్కోటి ఏకాదశి శోభ.. స్వామిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుపతి, డిసెంబర్ 30: తెలుగు రాష్ట్రాల్లో ముక్కోటి ఏకాదశి సందడి నెలకొంది. పలు దేవాలయాల్లో ఉత్తరద్వారాలు తెరుచుకోవడంతో తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. గోవింద నామస్మరణతో ఆలయాలు మార్మోగుతున్నాయి. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్ధరాత్రి 12:05 గంటలకు వైకుంఠ ద్వారాలు తెరుచుకున్నాయి. ఇప్పటికే శ్రీవారి కొండకు తరలివచ్చిన భక్తులు ఉత్తర ద్వారం గుండా స్వామి వారిని దర్శించుకుంటున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలకు ప్రముఖుల తాకిడి ఎక్కువగా ఉంది. తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ, సినీ ప్రముఖులు ఉత్తర ద్వారం గుండా ఆ గోవిందుడిని దర్శించుకుంటున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు గోవిందుడిని దర్శించుకున్నారు. అనేక మంది రాజకీయ, సినీ ప్రముఖులు తెల్లవారుజామునే ఉత్తర ద్వారం గుండా శ్రీనివాసుడి దర్శనం చేసుకున్నారు.

**శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు వీరే..** ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురాం కృష్ణంరాజు, మంత్రులు నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, కొండపల్లి శ్రీనివాస్, అనగాని సత్య ప్రసాద్, కొల్లు రవీంద్ర, సవిత, తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మెగాస్టార్ చిరంజీవి సతీమణి సురేఖ, బాలకృష్ణ సతీమణి వసుంధర, నటులు రాజేంద్ర ప్రసాద్, నారా రోహిత్, శివాజీ, హీరోయిన్ శ్రీలీల, నటి హేమ, నిర్మాతలు డి.వి.వి దానయ్య, బండ్ల గణేష్, ఇండియన్ క్రికెటర్ తిలక్ వర్మ, సూర్య కుమార్ యాదవ్, చాముండేశ్వరి నాథ్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్, కళ్యాణి, దువ్వాడ శ్రీనివాస్, మాధురి, మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రోజా, ఎంపీలు మిథున్ రెడ్డి, డీకే అరుణ, ఎమ్మెల్యేలు రాజాసింగ్, మల్లారెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

## గ్రూప్-2 రిజర్వేషన్లపై దాఖలైన పిటిషన్లు కొట్టివేసిన ఏపీ హైకోర్టు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ గ్రూప్-2 అభ్యర్థులకు బిగ్ రిలీఫ్ దక్కింది. గ్రూప్-2 రిజర్వేషన్లపై దాఖలైన పిటిషన్లను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. కాగా, 2023లో విడుదలైన గ్రూప్-2 నోటిఫికేషన్‌పై రిజర్వేషన్ల విధానాన్ని సవాల్ చేస్తూ పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రిజర్వేషన్ రోస్టర్‌ను పాటించాలని కోరుతూ అభ్యర్థులు పిటిషన్లు దాఖలు చేశారు. 2023లో విడుదలైన గ్రూప్-2 నోటిఫికేషన్‌ను రద్దు చేసి, పాత నోటిఫికేషన్‌కు బదులు కొత్త నోటిఫికేషన్ జారీ చేయాలని అభ్యర్థులు కోరారు.




రిజర్వేషన్ల పాయింట్లను సవాల్ చేస్తూ, ప్రభుత్వ నిర్ణయాలు సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ విషయంపై విచారణ జరిపిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, రిజర్వేషన్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను తిరస్కరించింది.

## ఇలా చేస్తే మీ పార్టీ సమాధే.. జగన్‌పై మంత్రి కొల్లు ఫైర్

ప్రకాశం, డిసెంబర్ 30: మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. జగన్ అంటేనే ఒక ఫెయిల్యూర్ పొలిటీషియన్ అంటూ వ్యాఖ్యలు చేశారు. దోచుకోవటం, దౌర్జన్యాలు చేయడం , ప్రజలను మభ్యపెట్టే కార్యక్రమాలు చేయడమే అతని విధానమన్నారు. తన విలాసవంతమైన నివాసం కోసం రిషికొండలో రూ.400 కోట్ల ప్రజల సొమ్ముతో విలాసవంతమైన భవనాన్ని కట్టుకున్నారని మండిపడ్డారు. రుషికొండ భవనానికి, యోగాకి లింకు పెడుతున్నాడు అంటే ఇలాంటి వ్యక్తులు ఉండటం దురదృష్టకరమన్నారు. యోగా అనేది మన సనాతనమైన ఆస్తి అని తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చొరవతో 2014 నుంచి ప్రతి సంవత్సరం దేశంలో ఒక్కో ప్రాంతంలో నిర్వహిస్తున్నారని అన్నారు. వైజాగ్‌లో నిర్వహించిన యోగా డే ఖర్చు రూ.18 కోట్లు అని.. దానిని కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందన్నారు. యోగా వల్ల ప్రజల మానసిక శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. ఏపీ ప్రభుత్వం నెల రోజుల పాటు యోగాపై ప్రజలకు అవగాహన కల్పిస్తే, అవగాహన లేని జగన్ దానిని రాజకీయం చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ గురించి ఏం మాట్లాడాలో అర్థం



కావట్లేదన్నారు. అతనికి ప్రజలే తగిన తీర్పునిచ్చారని తెలిపారు. స్టీల్ ప్లాంట్‌ను మరలా రివైజ్ చేస్తున్నామని.... లాభాలలో నడుస్తోందని అన్నారు. అభివృద్ధి చేస్తున్న ప్రజలను తప్పుదోవ పట్టించే దుర్మార్గమైన మనస్తత్వం కలిగిన వ్యక్తిగా జగన్ ఉన్నారంటూ విరుచుకుపడ్డారు. ప్రజల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రం అభివృద్ధి చెందటం జగన్మోహన్ రెడ్డికి ఇష్టం లేదన్నారు.

జగన్ ఇలాంటి కార్యక్రమాలు చేస్తే వైఎస్ఆర్ పార్టీ సమాధిగా మారి పోతుందంటూ మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

## సమన్వయ లోపం వల్లే దుర్గ గుడిలో ఘటన: మంత్రి గొట్టిపాటి



అమరావతి : విజయవాడలోని దుర్గగుడిలో కరెంట్ సరఫరా అంశాన్ని కొందరు రాజకీయం చేయడం దురదృష్టకరమని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మంగళవారం రాజధాని అమరావతిలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ విలేకర్లతో మాట్లాడుతూ.. దుర్గ గుడిలో15 నిమిషాల పాటు కరెంట్ నిలిచిపోవడంపై ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించానని చెప్పారు. ఈ అంశం తన దృష్టికి వచ్చిన వెంటనే అధికారులతో మాట్లాడినట్లు వివరించారు. కరెంట్ నిలిచిపోవడంపై ఆ రోజే అధికారులను మందలించినట్లు పేర్కొన్నారు. అధికారుల మధ్య సమన్వయం లోపం వల్లే దుర్గ గుడిలో కరెంట్ సరఫరా నిలిచి పోయిందన్నారు. దీనిపై వెంటనే నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులను ఆదేశించానని తెలిపారు. ఈ ఘటనలో తప్పు చేసిన వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూస్తామని పేర్కొన్నారు. భక్తుల మనోభావాలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పునరుద్ఘాటించారు.

**ఇంతకీ ఏం జరిగిందంటే..** దుర్గ గుడి దేవస్థానం రూ. 3.08 కోట్ల విద్యుత్ బిల్లుల బకాయిలు చెల్లించాల్సి ఉందని తెలుస్తోంది. బిల్లులు చెల్లించాలంటూ దేవస్థానం ఉన్నతాధికారుల దృష్టికి విద్యుత్ శాఖ సిబ్బంది తీసుకెళ్లారు. అయినా ఫలితం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో డిసెంబర్ 27వ తేదీ శనివారం విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువు తీరిన దుర్గమ్మ దేవాలయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ సమయంలో భక్తుల రద్దీ అధికంగా ఉండడంతోపాటు అమ్మవారికి నైవేద్యం సమర్పించే సమయంలో విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. దీంతో భక్తులతోపాటు ఆలయం సిబ్బంది సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఆలయ ఉన్నతాధికారులు ఈ విషయాన్ని విద్యుత్, దేవాదాయ శాఖ మంత్రుల దృష్టికి తీసుకు వెళ్లారు. అనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్దరించారు. ఈ ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. మరోవైపు దుర్గ గుడిలో విద్యుత్ సరఫరా నిలిపివేయడంపై కొందరు రాజకీయం చేసేందుకు యత్నించారు. దాంతో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌పై విధంగా స్పందించారు.




ఢాకా: బంగ్లాదేశ్‌లో దీపూ చంద్ర దాస్, అమృత్ మండల్ అనే హిందూ యువకుల హత్యోదంతాలు మరవక ముందే మరో హిందువు హత్యకు గురయ్యాడు. మయమన్‌సింగ్ జిల్లాలోని ఒక కర్మాగారంలో సెక్యూరిటీగార్డుగా విధులు నిర్వర్తిస్తున్న బజేంద్ర బిశ్వాస్ (42)ను అతడి సహోద్యోగి నోమన్ మియా కాల్చి చంపినట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. సోమవారం సాయంత్రం 6.45 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. అయితే తాము ఇద్దరం ఫ్యాక్టరీ బారక్‌లో సరదాగా మాట్లాడుకుంటున్న సమయంలో భద్రత కోసం ఉపయోగించే తుపాకీని బిశ్వాస్ వైపు గురిపెట్టానని..అనుకోకుండా చేయి ట్రిగర్‌కు తాకడంతో తుపాకీ పేలి, బుల్లెట్ అతడికి తగిలిందని నోమన్ మియా పేర్కొన్నాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అతడు మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు తెలిపాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నోమన్ మియాను అరెస్టు చేశారు. బిశ్వాస్ మృతికి కారణాలపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. బంగ్లాదేశ్‌లో కొనసాగుతోన్న అల్లర్లలో 25 ఏళ్ల దీపూ చంద్ర దాస్‌పై అల్లరిమూకలు దాడి చేసి హత్య చేశాయి. అది మరవకముందే ఇటీవల మరో హిందూ యువకుడిని రాజ్‌బరి జిల్లా పంగ్షా సర్కిల్‌లో గ్రామస్థులు కొట్టి చంపారు. తాజాగా మరో హత్య జరగడంతో ఆ దేశంలో హిందువుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది.



## శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ఆధునికీకరణ పనులకు పవన్ శంకుస్థాపన

అమరావతి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ఆధునికీకరణ పనులకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కూడా వర్చువల్‌గా హాజరయ్యారు. కోనసీమ కొబ్బరి రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ రూ. 20.77 కోట్ల అంచనా వ్యయంతో ఈ పనులకు పవన్ శ్రీకారం చుట్టారు.

ఇటీవల రాజోలులో తన పర్యటన సందర్భంగా 45 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

35 రోజుల్లోపే ఈ సమస్యకు సీఎం చంద్రబాబు, పవన్‌కల్యాణ్ పరిష్కారం చూపినట్లు జనసేన పార్టీ పేర్కొంది.

## ఖలీదా జియా మృతి పట్ల ప్రధాని మోదీ సంతాపం..





బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ అధినేత్రి బేగం ఖలీదా జియా (80) కన్నుమూశారు. గత కొంత కాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ రోజు (మంగళవారం) తెల్లవారుజామున ఢాకాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. ఆమె మృతిపై ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. భారతదేశం – బంగ్లాదేశ్ సంబంధాలను బలోపేతం చేయడంతో ఆమె పాత్రను ప్రశంసించారు. 'ఢాకాలో మాజీ ప్రధానమంత్రి, BNP చైర్ పర్సన్ ఖలీదా జియా మరణించిన వార్త విని ఎంతో బాధపడ్డాను. ఆమె కుటుంబానికి, బంగ్లాదేశ్ ప్రజలందరికీ మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యం ఆమె కుటుంబానికి ఇవ్వాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా. బంగ్లాదేశ్ తొలి మహిళా ప్రధానిగా, ఆ దేశ అభివృద్ధికి భారత్–బంగ్లా సంబంధాలకు ఆమె చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుంది. 2015 లో ఢాకాలో ఆమెతో ఒక సమావేశంలో పాల్గొన్నా. ఆమె గొప్ప దార్శనికురాలు, ఎప్పటికీ మాలాంటి వారికి మార్గనిర్దేశం చేస్తూనే ఉంటారని ఆశిస్తున్నాం' అంటూ తన 'X' ఖాతాలో పోస్ట్ చేశారు.




దేశ రాజధాని దిల్లీలోని కీలక వీఐపీ-89 జోన్‌లో గగనతల భద్రత కోసం కేంద్రం కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దేశీయ సమీకృత ఎయిర్ డిఫెన్స్ వెపన్ సిస్టమ్స్ కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనం వెల్లడించింది. 'సుదర్శన చక్ర' ఫ్రేమ్‌వర్క్‌లో భాగంగా పైలట్ ప్రాజెక్ట్ కింద దీన్ని ఏర్పాటుచేయనున్నట్లు ఆ కథనం పేర్కొంది. ఈ గగనతల రక్షణ వ్యవస్థ విలువ దాదాపు రూ. 5,181 కోట్లు ఉంటుందని అంచనా. దీన్ని డీఆర్‌డీవో అభివృద్ధి చేసింది. ఇది దేశ రాజధాని చుట్టూ 30 కిలోమీటర్ల పరిధిలో ఎటువంటి గగనతల ముప్పునైనా అడ్డుకోగలదని సదరు వర్గాలు వెల్లడించాయి. సున్నితమైన ప్రాంతాల్లో డ్రోన్ల వంటి ముప్పు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మిలిటరీ పోరాట సామర్థ్యాలను మరింత పెంచేలా రూ.79 వేల కోట్ల విలువైన ఆయుధ సామగ్రి కొనుగోలుకు రక్షణ మంత్రిత్వశాఖ సోమవారం ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగానే ఈ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ కొనుగోలుకు కూడా అంగీకారం తెలిపినట్లు సమాచారం.

**దీర్ఘశ్రేణి పినాక రాకెట్ పరీక్ష విజయవంతం...** 'సుదర్శన్ చక్ర' పేరుతో దేశంలో కీలక ప్రాంతాలను గగనతల దాడుల నుంచి రక్షించేలా బహుళ అంచెల కవచాన్ని, ప్రతిదాడి వ్యవస్థను మోహరించనున్నట్లు ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ వేళ ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. దేశంలోని వ్యూహాత్మక, పౌర, జాతీయ ప్రాముఖ్యం ఉన్న ప్రాంతాలను రక్షించడం దీని లక్ష్యం. ఇందులో భాగంగా శత్రు క్షిపణులు, యుద్ధవిమానాలను గుర్తించి, వాటిని నేలకూల్చే వ్యవస్థలను అభివృద్ధి చేయనున్నారు.

సైబర్ యుద్ధాన్ని తిప్పికొట్టే సామర్థ్యాన్ని కూడా ఈ వ్యవస్థలో అనుసంధానించనున్నారు. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో), ప్రైవేటు సంస్థలు, సైన్యం మధ్య భాగస్వామ్యంతో దీన్ని ఏర్పాటు చేసేందుకు కేంద్రం ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించింది.




కృష్ణా, డిసెంబరు 30 : గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ కీలక నేత వల్లభనేని వంశీమోహన్ మరోసారి అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ విషయం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. 2024 జూన్ 7వ తేదీన సునీల్ అనే వ్యక్తిపై దాడి కేసులో ప్రధాన నిందితుడిగా వంశీ ఉన్న విషయం తెలసిందే. ఈ క్రమంలో ఆయనపై మరింత తీవ్రమైన అభియోగాలు నమోదయ్యాయి. ఈ నెల 17వ తేదీన మాచవరం పోలీసులు వల్లభనేని వంశీపై హత్యాయత్నం కేసును నమోదు చేశారు. సునీల్‌పై జరిగిన దాడి ఘటనకు సంబంధించి మొదటి నుంచే వంశీ పాత్రపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. దర్యాప్తు కొనసాగుతున్న క్రమంలో కీలక ఆధారాలు లభించడంతో, హత్యాయత్నం కింద కేసు నమోదు చేసినట్లు మాచవరం పోలీసులు వెల్లడించారు. ఈ కేసు నమోదు తర్వాత నుంచి వల్లభనేని వంశీ పోలీసుల అందుబాటులోకి రాలేదు. దీంతో ఆయన అజ్ఞాతంలోకి వెళ్లినట్లు పోలీసులు భావిస్తున్నారు. వంశీపై కేసు నమోదు కావడం, వెంటనే ఆయన కనిపించకపోవడం రాజకీయ వర్గాల్లో ఉత్కంఠను పెంచుతోంది. గతంలోనూ వివాదాస్పద అంశాల్లో ఆయన పేరు వినిపించిన నేపథ్యంలో ఈ తాజా పరిణామం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఇదిలా ఉంటే.. గతంలో గన్నవరం టీడీపీ ఆఫీసుపై వంశీ, వైసీపీ కీలక నేతలు దాడి చేశారు. ఈ కేసులో సత్యవర్ధన్ ప్రధాన సాక్షిగా ఉన్నారు. ఈ కేసు బయటకు రాకుండా ఉండాలనే ఉద్దేశంతోనే సత్యవర్ధన్‌ను వంశీ కిడ్నాప్ చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ కేసులోనే ఆయన జైలుకు వెళ్లి బెయిల్‌పై విడుదల అయ్యారు. మాచవరం పోలీసులు వంశీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఆయనకు సంబంధించిన సన్నిహితులు, అనుచరులపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. వంశీ దేశంలోనే ఉన్నారా లేక ఇతర ప్రాంతాలకు వెళ్లారా అనే అంశంపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు. నిందితుడు ఎంతటి రాజకీయ నేపథ్యం కలిగి ఉన్నా చట్టం ముందు అందరూ సమానమేనని పోలీసులు స్పష్టం చేశారు. వంశీని త్వరలోనే అదుపులోకి తీసుకుని విచారణ చేపడతామని తెలిపారు. ఈ కేసుకు సంబంధించి అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతుందని చెప్పుకొచ్చారు. ఈ వ్యవహారం గన్నవరం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. స్థానికంగా భద్రతపై కూడా పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు మాచవరం పోలీసులు వెల్లడించారు.

## గ్లామర్ వర్క్ అవుట్ కాలేదని ఈసారి అలా..?

మహానటి కీర్తి సురేష్ సౌత్ లో తన ఫాలోయింగ్ ఒక రేంజ్ లో ఉన్నా కూడా బాలీవుడ్ లో కూడా తన సత్తా చాటాలని ఒక అటెంప్ట్ చేసింది. బేబీ జాన్ అంటూ అమ్మడు చేసిన ప్రయత్నం వర్క్ అవుట్ కాలేదు. సౌత్ లో చాలా క్లీన్ ఇమేజ్ తో ట్రెడిషనల్ లుక్స్ తో కనిపించిన కీర్తి సురేష్ ఒక్కసారి బాలీవుడ్ నీళ్లు పడ్డాయో లేదో థై షోస్ తో అదరగొట్టేసింది. కీర్తి సురేష్ సౌత్ లో ఇన్ని సినిమాలు చేసినా కూడా చేయని గ్లామర్ షో బేబీ జాన్ లో గుమ్మరించేసింది. ఐతే అదంతా బీ టౌన్ ఆడియన్స్ మెప్పు కోసమే అని తెలుస్తున్నా కూడా అమ్మడు ఈ రేంజ్ గ్లామర్ షో అయితే ఆమె ఫ్యాన్స్ ఎక్స్ పెక్ట్ చేయలేదు.

**బేబీ జాన్ కి బిఫోర్ రిలీజ్ మంచి బజ్..** ఐతే గ్లామర్ షో వల్ల బేబీ జాన్ కి బిఫోర్ రిలీజ్ మంచి బజ్ వచ్చినా సినిమాలో మ్యాటర్ లేకపోవడం వల్ల రిజల్ట్ రివర్స్ అయ్యింది. ఐతే నెక్స్ట్ గ్లామర్ షో కాకుండా ఈసారి కీర్తి సురేష్ ఒక మంచి సినిమాతో మరో ప్రయత్నం చేస్తుంది.



అదే శిక్షక్. బాలీవుడ్ టాలెంటెడ్ యాక్టర్ రాజ్ కుమార్ రావు నటిస్తూ నిర్మిస్తున్న ఈ సినిమాలో కీర్తి సురేష్ ఛాన్స్ అందుకుంది. ఈ సినిమాను ఆదిత్య నింబల్కర్ డైరెక్ట్ చేస్తున్నారు. ఇండియన్ ఎడ్యుకేషన్ సిస్టం నేపథ్యంతో ఈ సినిమా వస్తుందని తెలుస్తుంది. సినిమాలో టానియా మనిక్తల కూడా ప్రధాన పాత్రలో నటిస్తుంది. ఐతే కీర్తి సురేష్ కి సౌత్ లో మంచి నటీమణిగా పేరు ఉంది. అలాంటి పాత్రలో హిందీలో కూడా అదరగొట్టేస్తుంది. బేబీ జాన్ తో తప్పు జరిగినా ఈసారి రాబోతున్న సినిమాల విషయంలో మాత్రం అమ్మడు అసలు తప్పు చేయకూడదు అనుకుంటుంది. ఈ క్రమంలోనే అమ్మడు శిక్షక్ ఛాన్స్ అందుకుంది. ఇక అమ్మడి తెలుగు సినిమాల విషయానికి వస్తే విజయ్ దేవరకొండ తో రౌడీ జనార్ధన్ సినిమా చేస్తున్న కీర్తి సురేష్ నెక్స్ట్ ఎల్లమ్మ సినిమాలో కూడా కథానాయికగా నటిస్తుందన్న టాక్ ఉంది. వేణు యెల్దండి డైరెక్షన్ లో తెరకెక్కబోతున్న ఎల్లమ్మ సినిమా ఫైనల్ కాస్టింగ్ పై ఇప్పటివరకు క్లారిటీ రాలేదు. కీర్తి సురేష్ కి ఆ ఛాన్స్ వస్తే మాత్రం మరోసారి అవార్డ్ గ్యారెంటీ అనేలా స్క్రిప్ట్ ఉందని తెలుస్తుంది. కీర్తి సురేష్ కూడా మళ్లీ టాలీవుడ్ లో గ్రిప్ సాధించేందుకు అమ్మడు గురి పెట్టింది. రాబోతున్న రెండు సినిమాలు తప్పకుండా తెలుగులో మళ్లీ కీర్తి సురేష్ ని తిరిగి ఫాం లోకి వచ్చేలా చేస్తాయన్న టాక్ ఉంది. అటు బాలీవుడ్ లో కూడా తన ప్రయత్నాలను ఆపట్లేదు కీర్తి సురేష్.

## 39లోనూ తరగని అందం.. 'మన్మథుడు' బ్యూటీ గ్లామర్ ట్రీట్!

'మన్మథుడు' సినిమాలో నాగార్జున సరసన మహేశ్వరిగా నటించి, తన క్యూట్ లుక్స్‌తో తెలుగు ప్రేక్షకులను మాయ చేశారు అన్షు అంబానీ. ఆ ఒక్క సినిమాతోనే టాలీవుడ్‌లో చెరగని ముద్ర వేసుకున్నారు. తన అమాయకమైన నవ్వు, అభినయంతో కుర్రాళ్ళ హృదయాలను కొల్లగొట్టారు. ఇక లేటెస్ట్ గా అన్షు షేర్ చేసిన ఫొటోలు చూసి ఫ్యాన్స్ ఆశ్చర్యపోతున్నారు. ప్రస్తుతం 39 ఏళ్ల వయసులో ఉన్నప్పటికీ, ఆమె అందం ఏమాత్రం తగ్గలేదు. లేత పసుపు రంగు డిజైనర్ శారీలో, స్ట్రాప్‌లెస్ బ్లౌజ్ ధరించి ఎంతో గ్లామరస్‌గా, అదే సమయంలో క్యూట్‌గా కనిపిస్తున్నారు. ఆమె గ్రేస్ చూస్తుంటే వయసు



జస్ట్ ఒక నెంబర్ అనిపిస్తోంది. 'మన్మథుడు' తర్వాత ప్రభాస్ సరసన 'రాఘవేంద్ర' చిత్రంలో మెరిశారు. కెరీర్ మంచి పీక్ స్టేజ్?లో ఉన్నప్పుడే వ్యక్తిగత కారణాలతో సినిమాలకు దూరమయ్యారు. లండన్?లో స్థిరపడి, ఫ్యాషన్ డిజైనర్‌గా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఇన్ని సంవత్సరాలైనా ఆమెలోని ఆకర్షణ మాత్రం అలాగే ఉండటం విశేషం. ఇటీవల అమ్మడు సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేశారు. ఎంత బిజీగా ఉన్నా, సోషల్ మీడియా ద్వారా మాత్రం ఫ్యాన్స్ కు ఎప్పుడూ దగ్గరగానే ఉంటున్నారు. తన ఫ్యాషన్ లేబుల్?కు సంబంధించిన డిజైన్స్‌తో పాటు, అప్పుడప్పుడు ఇలాంటి బ్యూటిఫుల్ ఫొటోషూట్స్ పోస్ట్ చేస్తూ అలరిస్తున్నారు. ఆమె మళ్ళీ స్పెషల్ రోల్స్ చేస్తే బాగుంటుందని చాలా మంది అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. సాధారణంగా హీరోయిన్లు సినిమాలకు దూరమైతే గ్లామర్ తగ్గుతుంది, కానీ అన్షు విషయంలో అది రివర్స్ అయింది. 39 ఏళ్లలోనూ 20 ఏళ్ల అమ్మాయిలా మెరిసిపోతూ, నేటితరం హీరోయిన్లకు కూడా గట్టి పోటీ ఇస్తున్నారు. ఈ లేటెస్ట్ పిక్స్ చూస్తుంటే ఆమె మళ్లీ వెండితెరపై హీరోయిన్ గా చేసినా ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదని చెప్పవచ్చు.




## పబ్బులో చిరు, వెంకీ ఆట పాట.. ప్రోమో అదిరింది..!



మెగాస్టార్ చిరంజీవి అనిల్ రావిపూడి కాంబినేషన్ లో వస్తున్న మన శంకర వరప్రసాద్ సినిమా గారుసంక్రాంతికి రిలీజ్ ఫిక్స్ చేశారు. పొంగల్ రేసులో మస్ జబర్దస్త్ ఎంటర్టైన్మెంట్ ఇచ్చేందుకు ఈ సినిమా రెడీ అవుతుంది. చిరంజీవి సరసన నయనతార హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాలో భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నారు. ఇప్పటికే సినిమా నుంచి రిలీజైన రెండు సాంగ్స్ ఆడియన్స్ ని ఇంప్రెస్ చేశాయి. ఇక లేటెస్ట్ గా ఎం.ఎస్.జి నుంచి థర్డ్ సాంగ్ ప్రోమో వచ్చింది.

**విక్టరీ వెంకటేష్ స్పెషల్ క్యామియో..** ఈ సాంగ్ అలాంటి ఇలాంటి సాంగ్ కాదు. మెగా విక్టరీ మాస్ సాంగ్ గా వస్తుంది. అదేంటి అంటే మన శంకర వరప్రసాద్ గారు సినిమాలో మన విక్టరీ వెంకటేష్ కూడా ఒక స్పెషల్ క్యామియో చేస్తున్నారు. ఈ రోల్ తో పాటు చిరంజీవితో కలిసి ఒక సాంగ్ కూడా చేశారు. మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేష్ ఇద్దరు కలిసి చేసిన ఈ మెగా విక్టరీ సాంగ్ ప్రోమో లేటెస్ట్ గా రిలీజైంది.

భీమ్స్ మాస్ బీట్ కి పబ్ బ్యాక్ డ్రాప్ లో మంచి మాస్ అండ్ పెప్పీ సాంగ్ గా ఈ పాట వస్తుందని అనిపిస్తుంది. మెగా విక్టరీ మాస్ సాంగ్ ప్రోమో లో పెద్దగా మ్యూజిక్ ఇవ్వలేదు కానీ అలా ఒకే స్క్రీన్ లో చిరంజీవి, వెంకటేష్ ను చూస్తుంటే ఫ్యాన్ ఫీస్ట్ పక్కా అనేలా ఉంది. మెగాస్టార్ చిరంజీవి సినిమాలో విక్టరీ వెంకటేష్ నటించడం ఆడియన్స్ కి థ్రిల్ అనిపిస్తుంది.

**సంక్రాంతికి చిరంజీవి ఎం.ఎస్.జి తో పాటు..** ఈ సంక్రాంతికి చిరుతో పాటు వెంకటేష్ చేసే హంగామా ఎలా ఉండబోతుందో చూడాలని ఆడియన్స్ చాలా ఆసక్తిగా ఉన్నారు. మెగా విక్టరీ సాంగ్ ప్రోమో అదిరిపోగా ఫుల్ సాంగ్ డిసెంబర్ 30న రిలీజ్ కాబోతుంది. కచ్చితంగా న్యూ ఇయర్ పార్టీకి సరిపోయేలా ఈ సాంగ్ ఉండేలా ప్లాన్ చేసినట్టు ఉన్నారు.

మన శంకర వరప్రసాద్ గారుసినిమాలో మిగతా ఎలిమెంట్స్ అన్ని ఎలా ఉన్నా చిరంజీవి, వెంకటేష్ స్క్రీన్ షేరింగ్ అన్నది మాత్రం నెక్స్ట్ లెవెల్ అనిపిస్తుంది. తెలుగు సినిమా నాలుగు స్థంబాల్లో ఇద్దరైన చిరంజీవి, వెంకటేష్ ఇలా ఒకే స్క్రీన్ పై కనిపిస్తే ఆడియన్స్ కి అంతకుమించిన ఐ ఫీస్ట్ మరోటి ఉండదని చెప్పొచ్చు. సంక్రాంతికి చిరంజీవి ఎం.ఎస్.జి తో పాటు మరో నాలుగైదు సినిమాలు రేసులో ఉన్నా కూడా ఆడియన్స్ కి ఫస్ట్ ఛాయిస్ అనిపించేలా మెగా మూవీ రానుంది.

ఈ సినిమాలో వెంకటేష్ కూడా భాగం అవ్వడం దగ్గుబాటి ఫ్యాన్స్ కి ఫెస్టివల్ కి తమ హీరోని సిల్వర్ స్క్రీన్ పై చూసే ఛాన్స్ దక్కినట్టు అవుతుంది.

## సంక్రాంతికి 'రాజు' గారు రావడం లేదా?



టాలీవుడ్ సినీ ఇండస్ట్రీకి సంక్రాంతి సీజన్ కీలకమని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. ఏటా పొంగల్ కు అనేక సినిమాలు ప్రేక్షకుల ముందుకు వస్తాయి. బెర్తులను ఖరారు చేసుకోవడానికి ముందు నుంచే కర్చీఫులు వేసుకుంటాయి. కచ్చితంగా పెద్ద పండగకే విడుదల చేయాలని మేకర్స్, హీరోలు ఫిక్స్ అవుతుంటారు. బాక్సాఫీస్ వద్ద పోటీ పడుతుంటారు. వచ్చే ఏడాది సంక్రాంతి పండగకు కూడా పలు సినిమాలు థియేటర్స్ లోకి రానున్నాయి. అందుకు గాను ఇప్పటికే ఆయా చిత్రాల మేకర్స్ ఫిక్స్ అయ్యారు. అందుకు అనుగుణంగా సినిమాలకు సంబంధించిన పనులు పూర్తి చేసుకుంటున్నారు. త్వరలో తమ మూవీల రిలీజ్ డేట్స్ ను స్పెషల్ అప్డేట్స్ తో అనౌన్స్ చేయనున్నారు. అయితే 2026 సంక్రాంతికి చిరంజీవి మన శంకరవరప్రసాద్ గారు, ప్రభాస్ ది రాజా సాబ్, రవితేజ భర్త మహాశయులకు విజ్ఞప్తి, విజయ్ జన నాయగన్ రిలీజ్ అవ్వనున్నాయి. శర్వానంద్ నారీ నారీ నడుమ మురారి కూడా విడుదలవుతుందని టాక్. యంగ్ హీరో నవీన్ పోలిశెట్టి లీడ్ రోల్ లో నటించిన అనగనగా ఒక రాజు కూడా పొంగల్ కు రానుందని ఇప్పటికే అనౌన్స్ చేశారు మేకర్స్. జనవరి 14వ తేదీన విడుదల చేస్తామని తెలిపారు. ఇప్పటికే సినిమా నుంచి రిలీజ్ చేసిన ప్రమోషనల్ కంటెంట్ రావడంతో సినీ ప్రియులు మంచి అంచనాలు పెట్టుకున్నారు. ఫ్యామిలీ అండ్ కామెడీ ఎంటర్టైనర్ గా రానున్న ఆ మూవీ కోసం వెయిట్ చేస్తున్నారు. కానీ ఇప్పుడు జనవరి 14వ తేదీన అనగనగా ఒక రాజు మూవీ రిలీజ్ అయ్యేటట్లు లేదని టాక్ వినిపిస్తోంది. సంక్రాంతికి భారీ పోటీ ఉండడంతో అనగనగా ఒక రాజు మూవీ.. వెనకడుగు వేసిందని ఇప్పుడు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. జనవరి 23వ తేదీన సినిమా రిలీజ్ అయ్యే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. అది కాకపోతే.. రిపబ్లిక్ డే వీకెండ్ లో విడుదల్వనుందని టాక్ వినిపిస్తోంది. కానీ మేకర్స్ నుంచి ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అయితే భారీ పోటీ ఉందని ఇప్పుడు తప్పుకున్నా.. ప్రచారంలో ఉన్న కొత్త తేదీ కూడా అంత సేఫ్ కాదు. ఎందుకంటే సంక్రాంతికి థియేటర్స్ లో భారీ సినిమాలు రిలీజ్ అవ్వనున్నాయి. వాటికి పాజిటివ్ టాక్ వస్తే కచ్చితంగా కొన్ని రోజులపాటు ఓ రేంజ్ లో సందడి చేస్తాయి. కాబట్టి అనగనగా ఒక రాజు కొత్త తేదీ కూడా కాస్త రిస్క్ తో కూడకున్నదే. అదే సమయంలో మూవీ రిలీజ్ ఇప్పటికే చాలా లేట్ అయింది. ఇప్పుడు మళ్లీ వాయిదా పడేలా కనిపిస్తోంది. మరి మేకర్స్ ఏం చేస్తారో వేచి చూడాలి.

## రాశీఖన్నాలో అసంతృప్తి..ఆవేదన!

సినిమా ఇండస్ట్రీలో ఛాన్సులు రావాలంటే? వివాదాలకు వెళ్లకుండా కామ్ గా ఉంటేనే సాధ్యమవుతుంది. తప్పు అయినా సరే అక్కడ ప్రశ్నించడానికి ఉండదు. గొంతెత్తి మాట్లాడితే? బ్యాకెండ్ లో తొక్కే ప్రయత్నాలు అంతే సీరియస్ గా జరుగుతుంటాయి. ఇది అందరికీ తెలిసిందే? అందుకే ఇండస్ట్రీలో ఉన్న ఎవరూ వివాదాల జోలికి వెళ్లరు. ఎప్పుడైనా ఏదో అంశంపై వివాదాలు తలెత్తినా మాట్లాడానికి విముఖత చూపిస్తుంటారు. కానీ లోలోపల మాత్రం లావా మరుగుతూనే ఉంటుంది. అది అగ్ని పర్వతం రూపంలో ఎలా బయట పడుతుందన్నది చెప్పలేం. కానీ సమయం వచ్చిందంటే బ్లాస్ట్ మామూలుగా ఉండదు. తాజాజా రాశీఖన్నా అలాగే బ్లాస్ట్ అయింది. రాశీఖన్నా అంటే ఇంత వరకూ కామ్ గోయింగ్ హీరోయిన్ అనే పేరు ఉంది. ఎలాంటి వివాదాల్లో వేలు పెట్టదు. తన పని తాను చేసుకుని పోవడం తప్ప! పరిశ్రమ అంతర్గత విషయాలు వేటిలోనూ ప్రవేశించదనే అభిప్రాయం ఉంది. కానీ సమయం వస్తే తాను కూడా శివంగిలా మారుతుందని ప్రూవ్ అయింది. తాజాగా అమ్మడు ఆన్



సెట్స్ లో సమానత్వం గురించి బ్లాస్ట్ అయింది. నటీనటుల మార్కెట్ విలువ ఎలా ఉన్నా? సినిమా సెట్స్‌లో మాత్రం అందరికీ సమాన గౌరవం దక్కాలని అభిప్రాయపడింది. దేశంలో చాలా కాలంగా హీరో వర్షిప్ కల్చర్ ఉందని, హీరోల బాక్సాఫీస్ వసూళ్ల ఆధారంగా వారిని నమ్మడం నిజమే. కానీ మార్కెట్ అనేది జెండర్ పై కాకుండా ట్యాలెంట్ పై ఆధారపడాలంది. ఎవరికి ఎక్కువ ఇంపార్టెన్స్ ఇవ్వాలన్నది మార్కెట్ మాత్రమే నిర్ణయిస్తుందన్నారు. తక్కువా? ఎక్కువా? అనే భావన ఆన్ సెట్స్ లో చూపించకూడదంది. మహిళా నటులకు మంచి సదుపాయాలు, వారికి లభించే గౌరవం ఎంత మాత్రం తగ్గకూడదంది. దీంతో ఇప్పుడీ వ్యాఖ్యలు నెట్టింట వైరల్ గా మారాయి. రాశీఖన్నా ఇంత వరకూ ఎక్కడా ఇలాంటి వ్యాఖ్యలు చేయలేదు. తెలుగులో చాలా సినిమాలు చేసింది. ఇక్కడ నటీనటులు, దర్శక, నిర్మాతలతో మంచి స్నేహం ఉంది. ఎలాంటి వివాదాలు కూడా ఆమె పై లేవు. అయితే రాశీఖన్నా ఈ మధ్య తెలుగు సినిమాల కంటే తమిళ, హిందీ సినిమాలకే ఎక్కువగా పని చేస్తోంది. అక్కడ ఎదురైన అనుభవాలు ఆధారంగా ఇలా స్పందించిందా? అన్న సందేహం నెటి జనులు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రాశీఖన్నా తెలుగులో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తోన్న ఉస్తాద్ భగత్ సింగ్‌లో నటిస్తోంది. బాలీవుడ్ లో రెండు సినిమాలు..కోలీవుడ్ లో ఓ చిత్రం చేస్తోంది.

## పొట్టి డ్రెస్సులో టిల్లు పాప.. స్టన్నింగ్ లుక్!

'డిజె టిల్లు' సినిమాతో ఓవర్ నైట్ స్టార్‌గా మారిపోయారు నేహా శెట్టి. ఆ సినిమాలో 'రాధిక' పాత్రలో ఆమె చేసిన మ్యాజిక్ అంతా ఇంతా కాదు. ఆ ఒక్క సినిమాతో యూత్‌లో మంచి క్రేజ్ సంపాదించుకున్నారు. తన అందం, అభినయంతో కుర్రాళ్ళ కలల రాణిగా మారిపోయారు. లేటెస్ట్ గా నేహా శెట్టి సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫొటోలు వైరల్ అవుతున్నాయి. పచ్చని ప్రకృతి మధ్యలో, వైట్ కలర్ లేస్ డిజైన్ ఉన్న కో ఆర్డ్ సెట్?లో దేవకన్యలా మెరిసిపోతున్నారు. సూర్యకాంతి ఆమెపై పడుతుంటే, ఆ గ్లో మరింత పెరిగి ఆకర్షణీయంగా కనిపిస్తున్నారు. "ఆత్మ మృదువుగా ఉన్న చోట.. కాంతి సరిగ్గా తాకిన వేళ" అంటూ క్యాప్షన్ ఇచ్చారు. పూరి జగన్నాథ్ కుమారుడు ఆకాష్ పూరి నటించిన 'మెహబూబా' చిత్రంతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చారు నేహా. మొదటి సినిమా ఆశించిన ఫలితం ఇవ్వకపోయి



నా, సిద్దు జొన్నలగడ్డ సరసన 'డిజె టిల్లు'లో నటించి బ్లాక్‌బస్టర్ హిట్టు కొట్టారు. అప్పటి నుంచి ఇండస్ట్రీలో ఆమె పేరు మారుమోగి పోతోంది. ఆ తర్వాత 'బెదురులంక 2012', 'రూల్స్ రంజన్', ఇటీవల వచ్చిన 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' వంటి చిత్రాల్లో నటించి మెప్పించారు. కేవలం గ్లామర్ పాత్రలే కాకుండా, నటనకు ఆస్కారమున్న పాత్రలను ఎంచుకుంటూ కెరీర్‌ను పక్కాగా ప్లాన్ చేసుకుంటున్నారు. వరుస అవకాశాలతో టాలీవుడ్‌లో బిజీగా మారుతున్నారు. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం నేహా శెట్టి చాలా చురుగ్గా ఉంటారు. ఎప్పటికప్పుడు తన లేటెస్ట్ ఫొటోషూట్లు, గ్లామరస్ అప్‌డేట్స్ ఇస్తూ ఫ్యాన్స్‌ను అలరిస్తుంటారు. చీరకట్టులోనైనా, మోడ్రన్ డ్రెస్సులోనైనా తనదైన శైలిలో మెప్పిస్తూ ఫాలోవర్స్ సంఖ్యను పెంచుకుంటున్నారు. మరి ఈ గ్లామర్ తో అమ్మడు రానున్న రోజుల్లో ఎలాంటి సినిమాలు చేస్తుందో చూడాలి.

